Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 171 మేడ్చల్ మల్కాజ్‌గిరి 13 జూలై 2024 శనివారం పేజీలు : 4

## బద్రీనాథ్ హైవే మూసివేత..

న్యూఢిల్లీ: బద్రీనాథ్ హైవేను అధికారులు మూసివేశారు. దీంతో మార్గమధ్యంలో 3వేల మంది యాత్రికులు చిక్కుకుపోయారు. బద్రీనాథ్ హైవేని వరుసగా మూడో రోజులపాటు పోలీసులు మూసి వేశారు. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జోషి మఠ్ వద్ద కొండచరియలు విరిగి పడడంతో రహదారిని మూసివేశారు. దీంతో అక్కడ దాదాపు 2వేల మంది యాత్రికులు చిక్కుకు పోయారు. మరో 24 గంటల పాటు రోడ్డును బ్లాక్ చేయనున్నట్లు సమాచారం. ప్రయాణీకులను ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాల సహాయంతో సురక్షితంగా తరలిస్తున్నామని, ఆహారం, నీరు అందిస్తున్నామని అధికారులు తెలిపారు. రోడ్డును మూసివేస్తున్నట్లు ప్రకటించారు.




### అర్హులకే రైతు భరోసా

## పడావు భూములు, వెంచర్లకు రైతుబంధు ఇక బంద్

# నిజమైన సాగుదారుకే సాయం

హైదరాబాద్ : గత సర్కారు హయాంలో సాగులో లేని పడావు భూములు, గుట్టలు, ఇటుక బట్టీలు, రోడ్లు, నాన్ లే ఔట్ వెంచర్లకు ఇచ్చిన పెట్టుబడి సాయం ఇక మీదట ఆగిపోనుంది. వ్యవసాయం చేయడానికి వీల్లేని ఇలాంటి భూములకు గత సర్కారు పెట్టుబడి సాయం ఇవ్వడంపై సామాన్య ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వ్యవసాయ యోగ్యమైన భూములకే రైతు భరోసా ఇచ్చేందుకు కాంగ్రెస్ సర్కారు కసరత్తు చేస్తోంది. వానాకాలం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ అనర్హుల లెక్క తేల్చే పనిలో పడింది.

పాస్ పుస్తకాలు కలిగిన గుట్టలు, రహదారులు, కాల్వలు, ఫామ్ వెంచర్లు, నాన్ లేఔట్ ప్లాట్లు, పడావు భూములు, ఇటుక బట్టీలు, వ్యవసాయ భూముల్లో కొనసాగుతున్న పౌల్ట్రీ ఫామ్స్, ఇతర కమర్షియల్ అవసరాలకు వినియోగిస్తున్న వ్యవసాయ భూములను ఏఓలు, ఏఈఓలు ఐడెంటిఫై చేయనున్నారు. అనంతరం అనర్హులను గుర్తించి, రైతు భరోసా డేటా నుంచి తొలగించనున్నారు.

**5 శాతం భూములు పడావే...** ధరణి పోర్టల్ లో నమోదైన భూముల్లో 5 నుంచి 10 శాతం భూములు వ్యవసాయానికి యోగ్యం కాని భూములేనని తెలుస్తున్నది.

వ్యవసాయ అధికారులు పక్కాగా సర్వే చేస్తే హైదరాబాద్ చుట్టపక్కల ప్రాంతాలతోపాటు రాష్ట్రంలోని ముఖ్య నగరాలు, పట్టణాల చుట్టూ రెండు, మూడు దశాబ్దాల క్రితం ప్లాట్లు గా చేసిన భూములు , వెంచర్లు కలిపి సుమారు 3 లక్షల ఎకరాల వరకు తేలనున్నాయి. అలాగే గుట్టలు, రహదారులు, పడావు భూములు, అక్రమంగా పట్టా చేసిన ప్రభుత్వ భూములు, ఫారెస్టు భూములు, ఇటుక బట్టీల లెక్క కూడా బయటపడనున్నది. ఇలాంటి భూములు కూడా మరో 2 లక్షల ఎకరాల వరకు తేలే అవకాశముందని అధికారులు చెప్తున్నారు.

**రైతుభరోసా.. ఐదెకరాలా? పదెకరాలా ?...** రాష్ట్రంలో 68.99 లక్షల మంది రైతులకు 1.52 కోట్ల ఎకరాల భూమి ఉన్నట్టు రెవెన్యూ రికార్డులు వెల్లడిస్తున్నాయి. గత యాసంగి సీజన్ లో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రైతు భరోసా లెక్కల ప్రకారం.. ఎకరంలోపు ఉన్న రైతులు 24,24,870 మంది ఉండగా.. వారి వద్ద 13.57 లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అలాగే 2 ఎకరాల్లోపు ఉన్న రైతులు 17,72,675 మంది ఉండగా.. వారి వద్ద 26.58 లక్షల ఎకరాలు ఉన్నాయి. మొత్తంగా ఐదెకరాల్లోపు ఉన్న రైతులు రాష్ట్రంలో 64,75,320 మంది ఉండగా, వారి వద్ద 1,11,49,534 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది.

వాస్తవానికి గత వానాకాలం సీజన్ లో ఐదెకరాల్లోపు ఉన్న రైతులు 62 లక్షల మంది ఉండగా, వారి చేతిలో కోటి ఎకరాల భూమి ఉంది. కానీ గత కొద్ది నెలల్లోనే ఐదెకరాల్లోపు ఉన్న రైతులు సుమారు 2 లక్షల మంది పెరిగారు. ఐదెకరాల్లోపు ఉన్న రైతుల చేతిలో భూమి కూడా మరో 10 లక్షల ఎకరాల మేర పెరగడం విశేషం. రైతుభరోసాపై పరిమితి విధిస్తారనే ప్రచారం నేపథ్యంలోనే పదెకరాలకుపైగా ఉన్న రైతులు తమ కుటుంబ సభ్యుల పేరిట ఐదెకరాల చొప్పున ధరణిలో రిజిస్ట్రేషన్ చేయించినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం 4 లక్షల మంది వద్ద సుమారు 40 లక్షల ఎకరాల భూమి ఉంది. రైతు బంధును ఐదెకరాలకే పరిమితం చేస్తారా? లేదా పదెకరాలలోపు వారికి అమలు చేస్తారా? అనేది త్వరలోనే తేలనుంది.

**సంపన్నులకు రైతు భరోసా కట్!** గత సర్కార్ హయాంలో వ్యవసాయ భూములు కలిగి ఉన్న కోటీశ్వరులైన బడా కాంట్రాక్టర్లు, వ్యాపారులు, ఉన్నతాధికారులకు రైతుబంధు అందిన విషయం తెలిసిందే. ఎలాంటి నిబంధనలు విధించకుండా, లిమిట్ పెట్టకుండా వ్యవసాయ భూమి ఉన్న ప్రతి ఒక్కరికీ పెట్టుబడి సాయం అందిం చడంతో ఈ స్కీమ్ అభాసుపాలైంది. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక మొదటి బడ్జెట్ సమావేశా ల్లోనే వందల ఎకరాలు ఉన్న భూస్వాములు, సెలబ్రిటీలు, సినీ, రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, కోట్లాది రూపాయల ఆస్తులు ఉన్నవారికి రైతు భరోసా ఇవ్వొద్దని నిర్ణయించిన విషయం తెలిసిందే. నిజమైన సాగుదారుకే, వాస్తవ సాగుభూమికే రైతు భరోసా అందేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది.



## సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ చేరిన ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

హైదరాబాద్: రాజేంద్రనగర్ భారాస ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ కాంగ్రెస్‌లో చేరారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి వచ్చిన ఆయన సీఎం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన అనుచరులు కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డితో పలువురు నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రైవేటీకరణ కాదు.. రిపేర్.. మోదీ 3.0 వైఖరి ఇదేనా..?

నష్టాల్లో ప్రభుత్వరంగ సంస్థలను నడపడం.. వ్యాపారం చేయడం ప్రభుత్వ విధానం కాదు అంటూ ప్రైవేటీకరణ విషయంలో కుండబద్ధలు కొట్టిన మోదీ సర్కారు.. ఇప్పుడు తన వైఖరి మార్చుకున్నట్లు కనిపిస్తోంది. గత పదేళ్లలో ప్రైవేటీకరణ విషయంలో దూకుడుగానే ముందుకెళ్లిన సర్కారు.. ఇప్పుడు ప్రభుత్వరంగ సంస్థలకు మరమ్మతు చేయాలన్న యోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ రాయిటర్స్ వార్తా సంస్థ ఓ కథనాన్ని ప్రచురించింది. ప్రభుత్వ రంగానికి చెందిన 200 సంస్థలను లాభాల్లోకి తీసుకురావాలనేది మోదీ 3.0 ఆలోచనగా ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. వాటిని లాభాల్లోకి తీసుకురావడం ప్రభుత్వం ఉద్దేశంగా ఉందని పేర్కొన్నాయి. ఈ ప్రణాళికలో భాగంగా నిరుపయోగంగా ఉన్న ఆస్తులను, ఇతర ఆస్తులను నగదీకరించి ఆ మొత్తాన్ని ఆయా కంపెనీల్లో పెట్టుబడిగా పెట్టి.. ఆపై కంపెనీలకు దీర్ఘకాలిక లక్ష్యాలు నిర్దేశించనున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి. పనితీరు, ఉత్పత్తి మెరుగు కోసం ఐదేళ్ల లక్ష్యాన్ని నిర్దేశించనున్నట్లు పేర్కొన్నాయి. నగదీకరణకు సంబంధించి బడ్జెట్‌లో ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. దీంతో పాటు సుమారు



2.30 లక్షలకు పైగా మేనేజర్లకు శిక్షణ ఇప్పించి వారిని సీనియర్ రోల్స్‌లోకి తీసుకోవాలన్న ఆలోచన కూడా చేస్తోందని విశ్వసనీయ వర్గాల సమాచారం. వాస్తవానికి ప్రభుత్వ ప్రైవేటీకరణ జాబితాలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ కూడా ఒకటి. తాజాగా కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ పూరీ దీనిపై కీలక వ్యాఖ్యలు చేశారు. కంపెనీ ప్రస్తుతం భారీ లాభాల్లో కొనసాగుతోందని, కాబట్టి ప్రస్తుతానికి ప్రైవేటీకరణ ప్రస్తావన ఏదీ లేదని స్పష్టం చేశారు. మరోవైపు తక్కువ ధరకే ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారన్న అపవాదు కూడా మోదీ సర్కారుపై నాటుకుపోయింది. పైగా పార్లమెంట్‌లో భాజపాకు సొంతంగా బలం తగ్గడంతో ఇతర పార్టీలపై ఆధారపడాల్సిన పరిస్థితి. ఈ క్రమంలో పెట్టుబడుల ఉపసంహరణపై సర్కారు తన వైఖరిని మార్చుకుందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

**భారీ లక్ష్యం.. వాస్తవంలో కొంతే! :** మోదీ సర్కారు తొలిసారి అధికారం చేపట్టినప్పటినుంచి ప్రైవేటీకరణ విషయంలో దూకుడుగా వ్యవహరిస్తూ వచ్చింది. మరీ ముఖ్యంగా 2021-22 సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యాన్ని ఏకంగా రూ.1.75 లక్షల కోట్లు లక్ష్యంగా పెట్టుకుంది. రెండు బ్యాంకులు, ఒక బీమా కంపెనీ సహా నష్టాల్లో ఉన్న వివిధ కంపెనీలను విక్రయించాలని ప్రభుత్వం ఆలోచన చేసింది. తర్వాత ఆ అంచనాలను రూ.78 వేల కోట్లకు అంచనాలను సవరించారు. వాస్తవంలో ఆ ఆర్థిక సంవత్సరంలో వచ్చింది కేవలం రూ.13,531 కోట్లు మాత్రమే. ఎయిరిండియాను టాటా గ్రూప్‌నకు విక్రయించడం, ఎల్ఐసీలో 3.5 శాతం వాటాను ఐపీఓ ద్వారా విక్రయించడం మిగిలిన వాటి విషయంలోను ప్రభుత్వం వెనక్కి తగ్గింది.

# పూర్తి స్థాయి బడ్జెట్ కోసం ప్రభుత్వం కసరత్తు

## శాఖల నుంచి బడ్జెట్ ప్రతిపాదనలను తెప్పించుకుంటున్న ఆర్థిక శాఖ

## గత ఆరు నెలల ఆమ్దానీ, ఖర్చుల వివరాలు తీసుకుంటున్న ప్రభుత్వం

### గ్యారంటీలకు అధిక కేటాయింపులు చేసేలా ప్లాన్

### జులై మొదటి వారంలో రాష్ట్ర బడ్జెట్ పెట్టేందుకు ఏర్పాట్లు




హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం 2024-, 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పూర్తి స్థాయి బడ్జెట్ కోసం ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ఆర్థికశాఖ అన్ని శాఖల నుంచి ప్రతిపాదనలు కోరింది. ఈనెల 18వ తేదీ వరకు ఆయా శాఖల ద్వారా ప్రతిపాదనలు చేరాలని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2024,-25 సంవత్సరానికి మొత్తం రూ.2,75,891 కోట్లతో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. మొత్తం బడ్జెట్‌లో రెవెన్యూ వ్యయం రూ.2,01,178 కోట్లు, మూలధన వ్యయం రూ.29,669 కోట్లుగా పేర్కొంది. దీంతోపాటు ఈ బడ్జెట్‌లో ఎన్నికల హామీల అమలు కోసం ప్రభుత్వం రూ.53,196 కోట్లు ప్రతిపాదించింది. వ్యవసాయానికి రూ.19,746 కోట్లు, నీటిపారుదల కోసం రూ.28,024 కోట్లను ప్రతిపాదించారు. ఇలా నాలుగు నెలల కాలానికి ఓటాన్ అకౌంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తీసుకున్నందున జూలై నెలాఖరులోపు పూర్తి స్థాయి బడ్జెట్ కోసం కసరత్తు చేస్తోంది. ఉభయసభలు ఈ బడ్జెట్‌కు ఆమోద ముద్ర వేయాల్సి ఉంది. అయితే ఈసారి పూర్తి స్థాయి బడ్జెట్ కోసం ప్రభుత్వం కసరత్తు చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ ప్రాధాన్యతా పథకాలు, ఇటీవల ముఖ్యమైన ప్రకటనలను దృష్టిలో పెట్టుకోవాలని ఈ బడ్జెట్‌కు రూపకల్పన చేయాలని సిఎం నిర్ణయించినట్టుగా తెలిసింది. ఈ నేపథ్యంలోనే అన్ని శాఖలు వివిధ పథకాల పద్దులకు సంబంధించిన క్షుణ్ణంగా సమీక్షించుకొని ప్రతిపాదనలు ఇవ్వాలని స్పష్టం చేసింది.

**రైతు రుణమాఫీకి రూ.33,000 నుంచి రూ.35 వేల కోట్ల వరకు..** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు దాదాపుగా 6.71 లక్షల కోట్ల అప్పుల భారం ఉండగా వరుసగా ఎఫ్ఆర్ఎంబి పరిధిలో అవకాశాల మేరకు అప్పుల మీద అప్పులు చేస్తూ బాండ్లు తాకట్టు పెడుతూ పాలన కొనసాగిస్తోంది. ఇప్పటికే ఆరునెలల్లో ఎఫ్ఆర్ఎంబి పరిధికి మించి రూ.12,905 కోట్ల అప్పులు చేసింది. గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలతో కలిపి చెల్లింపులకు రేవంత్ ప్రభుత్వం సగటున రోజుకు రూ.290 కోట్ల మేరకు చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది. దీంతోపాటు కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు భారీగా పేరుకుపోవడంతో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. వాటికి తోడు ఆగష్టు 15వ తేదీ లోపు రైతు రుణమాఫీకి రూ.33,000 కోట్ల నుంచి రూ.35,000 కోట్ల వరకు అవసరమని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ హామీని కచ్చితంగా అమలు చేసి తీరాల్సిందేనని, నిధుల సేకరణకు ప్రణాళిక రూపొందించాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించడంతో, ఆర్థిక శాఖ అధికారులు కసరత్తు చేపట్టారు. ఈ క్రమంలోనే కార్పొరేషన్ ఏర్పాటు చేసి రుణమాఫీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

దీనికి రిజర్వ్ బ్యాంకు అంగీకరించాల్సి ఉంటుంది. లేదంటే ప్రత్యామ్నాయ ఆదాయ వనరులు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అలాగే రైతుల పంట బీమాకు ప్రభుత్వం ఏటా 2వేల కోట్ల ప్రీమియం చెల్లించాల్సి ఉంది. రాష్ట్రంలో 1.32కోట్ల ఎకరాల్లో పంటలు సాగు అవుతుండగా 2019 నుంచి ఫసల్ బీమా అమల్లో లేదు. ఇప్పుడు ప్రభుత్వం పంటల బీమాకు ప్రీమియం భరించాల్సి ఉంది. ఇకపోతే రైతుబంధు ఖరీఫ్ పంటల సాగు ప్రారంభమైనా ఇంకా ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ ప్రారంభించలేదు. ఈ నేపథ్యంలోనే పూర్తి స్థాయి బడ్జెట్‌లో హామీల అమలుకు ఎంత కేటాయిస్తారు? ఆదాయం పెంపుపై ఎలాంటి చర్యలు చేపట్టారన్నది త్వరలోనే తేలనుంది.

**మరో 45 రోజుల గడువు మాత్రమే...** %ఫిబ్రవరిలో నాలుగు నెలల కాలానికి ఓటాన్ అకౌంట్‌కు అనుమతి తీసుకున్నందున జూలై నెలాఖరులోపు పూర్తి స్థాయి బడ్జెట్‌కు మరో 45 రోజులు మాత్రమే గడువు ఉన్న తరుణంలో పూర్తి స్థాయి బడ్జెట్ రూపకల్పన చేసేలా ఆర్థికశాఖ కసరత్తు ప్రారంభించింది. అందులో భాగంగా పూర్తి స్థాయి బడ్జెట్ రూపకల్పన ప్రక్రియలో భాగంగా ఆర్థికశాఖ అన్ని శాఖల నుంచి ప్రతిపాదనలను కోరింది. ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి సంబంధించి ఆయా శాఖల పనితీరు సూచికల ఆధారంగా నిర్దేశించిన లక్ష్యాల పూర్తి వివరాలను ఇవ్వాలని ఆర్థికశాఖ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్య పథకాలకు బడ్జెట్ ప్రతిపాదనల్లో తగిన కేటాయింపులు చేయాలని నిర్ణయించింది. బడ్జెట్ అంచనాలకు తగిన హేతుబద్ధత ఉండాలని ఆర్థిక శాఖ తెలిపింది. కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించి రాష్ట్ర అవసరాలను పరిగణనలోకి తీసుకొని వీలైనన్ని ఎక్కువ నిధులు పొందేలా స్పష్టమైన మార్గదర్శకాలకు లోబడి ప్రతిపాదనలు తయారు చేయాలని ప్రభుత్వం తెలిపింది. బడ్జెట్ కసరత్తుపై తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. కేవలం పథకాలకు సంబంధించిన వ్యయ ప్రతిపాదనలను మాత్రమే ఇవ్వాలని ఆర్థికశాఖ తెలిపింది. నిర్వహణ వ్యయానికి సంబంధించి గతంలో ఇచ్చిన ప్రతిపాదనల ఆధారంగా కేటాయింపులు చేయాలని పేర్కొంది.

## సంపాదకీయం

# ఏపీలో కొత్త దోస్తీ విపక్షాలు కలుస్తాయా?

రాజకీయాలు ఎపుడూ ఒకేలా ఉండవు. పరిస్థితులు పరిణామాలు వాటి రూపురేఖలను మారుస్తూ ఉంటాయి. ఇదిలా ఉంటే వైసీపీ పుట్టాక ఒంటరిగానే ముందుకు సాగుతూ వచ్చింది. 2011 నుంచి ప్రతీ ఎన్నికలోనూ సింగిల్ గానే ఫైట్ ఇస్తూ వచ్చింది. అందులోనే విజయాలు అందుకుంది. అయితే ఈ సోలో పోరాటం 2024లో దారుణంగా బెడిసికొట్టింది. కేవలం 11 సీట్లకు వైసీపీ పడిపోయింది. అలా కాకుండా వైసీపీ వామపక్షాలతో పొత్తు పెట్టుకుని ఉంటే గెలుపు దక్కకపోయినా సులువుగా ఒక నలభై సీట్లు అయినా దక్కేవి అన్న చర్చ ఉంది. ఎందుకంటే వైసీపీ నలభై శాతం ఓట్లు వచ్చినా ఆ స్థాయిలో సీట్లు రాలేదు అంటే చాలా నియోజకవర్గాలలో ఓట్లు చీలిపోవడం వల్ల అని అంటున్నారు. ఇదిలా ఉంటే వైసీపీ దారుణమైన పరాజయానికి గురి అయి నెలన్నర రోజులు కావస్తోంది. ఏపీలో ఎన్డీయే కూటమి అధికారంలో ఉంది. కూటమి ముందు అనేక సవాళ్ళు ఉన్నాయి. సమయం చూస్తే కేవలం అయిదేళ్ళే. జగన్ చెప్పిన పరిభాషలో చెప్పుకోవాలంటే కళ్ళు మూసుకుంటే ఇట్టే గిర్రున తిరిగిపోతాయి. ఒక వైపు అభివృద్ధి మరో వైపు సంక్షేమం ఇంకో వైపు భారీ ప్రాజెక్టులు ఇవన్నీ ఈ అయిదేళ్ళ కాలంలో చేయడం అంటే కత్తి మీద సామే. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చూస్తే కొంత అస్థిరంగానే ఉంది. దాంతో పాటు కేంద్ర ప్రభుత్వ సమస్యలు దానికి ఉన్నాయి. అనుకున్నంతగా కేంద్రం నుంచి ఆర్థిక సాయం దక్కకపోతే ఏపీలో ఎన్డీయే ప్రభుత్వం అడుగు కూడా ముందుకు వేయలేదు. అదే సమయంలో కొన్ని ఇష్యూస్ లో బీజేపీ మొండి పట్టు టీడీపీకి గుదిబండగా మారినా ఆశ్చర్యం లేదు అని అంటున్నారు. ఉదాహరణకు విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో కేంద్రం ప్రైవేటీకరణకు మొగ్గు చూపుస్తుందని అంటున్నారు. మేము వ్యాపారాలు చేయమని కేంద్ర ప్రభుత్వ పెద్దలే అంత ఓపెన్ గా చెప్పాక ఇంక ఆలోచించాల్సింది ఏమి ఉంటుంది అని అంటున్నారు. స్టీల్ ప్లాంట్ తో పాటు ఒక లిస్ట్ లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలలో కేంద్ర ప్రభుత్వం పెట్టుబడులు ఉప సంహరించుకోవాలని చూస్తోంది. దాంతో ఆటోమేటిక్ గా అవి ప్రైవేట్ వైపే ఉంటాయని అంటున్నారు. ఈ విషయంలో కనుక ఏపీలో కూటమి పెద్దలు సాధించుకోకపోతే ఏపీలో పెను రాజకీయ గండం పొంచి ఉంటుందని అంటున్నారు. ఇప్పటికే ఒక ఆంగ్ల పత్రికలో వచ్చిన వార్తా కథనం మీద టీడీపీ నేతలు గుస్సా అయి ఆ పత్రిక ఆఫీస్ బోర్డుని దగ్ధం చేశారు. దీని మీద కామ్రేడ్ ఖండించాయి. వైసీపీ కాంగ్రెస్ కూడా ఖండించింది. ఇక్కడ ఈ మూడు పార్టీలూ కలిశాయి అంటే అది స్టీల్ ప్లాంట్ ఇష్యూతోనే అని చెప్పాల్సి ఉంటుంది. ఈ ఇష్యూలో కనుక కేంద్రం ప్రైవేట్ వైపు మొగ్గితే అదే ఈ పార్టీల మధ్య దోస్తీకి కూటమి మీద కుస్తీకి కారణం అవుతుంది అని అంటున్నారు. అదే విధంగా మరో ఇష్యూ ఉంది. ఇది కూడా కీలకమైనదే. అదేంటి అంటే ప్రత్యేక హోదా ఇష్యూ. ఈ ఇష్యూతో వైసీపీ ఉంది. కామ్రేడ్స్ కాంగ్రెస్ కూడా ఉన్నాయి. బీజేపీ నుంచి తగిన హామీని పొంది ప్రత్యేక హోదాను తీసుకుని రావాలని అపుడే ఈ మూడు పార్టీలు డిమాండ్ చేశాయి.

రానున్న రోజులలో కనుక ఈ దిశగా ప్రయత్నాలు సాగకపోయినా కేంద్రం తీరు వేరుగా ఉన్నా అది కూడా ఏపీలో విపక్షాల మధ్య రాజకీయ ఏకీకరణకు కారణం కావచ్చు అని అంటున్నారు. ఆలా కొత్త దోస్తీ కనుక బలపడితే అది కూటమికి పెను సవాల్ కావడమే కాదు వైసీపీకి కొండంత బలంగా మారే పరిణామమూ ఉండొచ్చు అని అంటున్నారు. సో కేంద్రంలోని బీజేపీ ఏపీ పట్ల ఎలా వ్యవహరిస్తుంది, ఏపీలో అధికారంలో ఉన్న టీడీపీ జనసేన కేంద్రం నుంచి ఏ మేరకు పరిష్కారాలు కనుగొంటారు అన్న దాని మీదనే ఏపీ ఫ్యూచర్ పాలిటిక్స్ ఆధారపడి ఉన్నాయని అంటున్నారు.


# భక్తి శ్రద్ధలతో ఆషాడ మాస భగవన్నామ శోభాయాత్ర





శామీర్ పేట, (గరుడ వార్త) : ఎంతో భక్తి శ్రద్ధలతో ఆషాడ మాస భగవన్నామ శోభ యాత్ర భక్తుల కోలాహలం మధ్య జరుపుకున్నారు. శుక్రవారం మూడుచింతలపల్లి మండలంలోని కేశ్వాపూర్లోని శ్రీ భవానంద స్వాముల చేతుల మీదుగా ప్రతిష్టించిన దుర్గామాత అమ్మవారి ఆలయం నుంచి శోభయాత్రను ప్రారంభించారు. కేశవాపూర్ నుంచి ప్రారంభమైన 93వ ఆషాడ శోభాయాత్ర ఉత్సవాలను భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. కేశ్వాపూర్ గ్రామం నుంచి పాండురంగాశ్రమం వరకు భజనలతో శోభాయాత్రను నిర్వహించారు. ఈ శోభాయాత్ర కేశ్వాపూర్ నుంచి ఉద్దమర్రి, మూడుచింతలపల్లి, లక్ష్మాపూర్ గ్రామాల మీదుగా పాండురంగాశ్రమం వరకు చేపట్టారు. ఈ శోభయాత్రలో వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని భగవన్నామ స్మరణతో భజనలు చేస్తూ శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని భవానంద స్వామి పాదుకలకు హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలోని వీధుల గుండా భజనలతో భక్తులు కోలాటాలు ఆడుతూ పాటలు పాడుతూ భక్తితో శోభాయాత్ర జరిపారు. ముందుగా కేశ్వాపూర్లో శ్రీభవానంద స్వాముల వారికి పూజలు నిర్వహించి శోభాయాత్రను చేపట్టారు. ఈ శోభాయాత్రలో భాగంగా వేదబ్రాహ్మణులను, పండితులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

# తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ లో రాష్ట్రస్థాయి విద్యార్థుల ఎంపిక పోటీల నిర్వహణ



శామీర్ పేట, (గరుడ వార్త) : తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్లో రాష్ట్రస్థాయి నాలుగవ తరగతి విద్యార్థుల ఎంపిక పోటీలు నిర్వహించారు. శామీర్ పేట మండలం తూముకుంట పరిధిలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్లో వివిధ జిల్లాలలోని విద్యార్థులకు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలు స్పోర్ట్స్ స్కూల్ లలో 2024-2025 సంవత్సరానికి నాలుగో తరగతి లో చేరుతారని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం వికారాబాద్, మహబూబ్ నగర్, నారాయణపేట్, జోగులాంబ- గద్వాల, వనపర్తి జిల్లాలకు చెందిన బాల, బాలికలు ఈ పోటీలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ స్కూల్ ఓ ఎస్ డి, వివిధ జిల్లాల పీడీలు, కోచులు పాల్గొన్నారు.

# ఖాళీ స్థలాలు.. సమస్యలకు నిలయాలు



జనగామ : జనావాసాల్లో ఖాళీ స్థలాలు మురికి నీటితో కుంటలుగా మారి, కంపు కొడుతున్నాయి. యజమానుల నిర్లక్ష్యం అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రజలకు పాట్లు తప్పడం లేదు. వర్షాకాలం ముందే వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఇటీవల నాలుగైదు పెద్ద వానలు కురిశాయి. ఇప్పటికే జనగామ పట్టణంలో వరద సమస్య ప్రారంభమైంది.

కట్టరు.. పట్టించుకోరు:

భావి అవసరాల దృష్ట్యా కొందరు ఇళ్ల స్థలాలను కొని వదిలేస్తున్నారు. ఆయా కాలనీల్లో గృహ నిర్మాణాలు ఊపందుకుని, ప్లాట్లకు విలువ పెరిగిన పిదప చూద్దాంలే అనుకొని ఏళ్ల తరబడి వదిలేయడంతో చెత్త, ముళ్లకంప చెట్లు పెరిగి దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. వర్షాకాలంలో మురుగు, వరద నీరు ప్లాట్లలోకి చేరి మురుగునీటి మడుగులుగా మారుతున్నాయి. జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీ, సాయినగర్, శ్రీవిల్లాస్ కాలనీ, జీఎంగోకుల్‌నగర్, బాలాజీనగర్, జ్యోతినగర్, ప్రగతినగర్, దుర్గానగర్, శామీర్‌పేట తదితర 20 ప్రాంతాల్లో ఆవాసాల మధ్య ఖాళీ స్థలాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి.

రిజిస్ట్రేషన్‌తో సరి

ప్లాట్లు ఖరీదు చేసేవారు రిజిస్ట్రేషన్ అనంతరం, మున్సిపల్‌లో తమ పేరిట ఆస్తి మార్పిడి చేయించుకోవాలి. దీని వల్ల డబుల్ రిజిస్ట్రేషన్ ప్రమాదాన్ని నివారించవచ్చు. ఆస్తి మార్పిడితో, సదరు స్థలం ఆస్తి పన్ను పరిధిలోకి వస్తుంది. దీన్ని తప్పించుకునేందుకు మ్యుటేషన్‌కు దూరంగా ఉంటున్నారని అధికారులు అంటున్నారు. ఖాళీ స్థలాల మ్యుటేషన్, అసెస్‌మెంట్‌పై దృష్టిసారిస్తే, ఖాళీ స్థలాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారికి నోటీసులు జారీ చేయవచ్చు. నోటీసుకు స్పందించని చోట, మున్సిపల్ ఆధ్వర్యంలో శుభ్రపర్చి సదరు ఖర్చులను వసూలు చేసే అవకాశం ఉంది. అప్పటికీ స్పందించని పక్షంలో స్వాధీనం చేసుకుని, రుసుము చెల్లించేదాకా నిర్మాణ అనుమతులను నిరాకరించవచ్చు. నిబంధనల అమలుపై మున్సిపల్ అధికారులు దృష్టి పెట్టాల్సి ఉంది.

ప్రభుత్వ స్థలాల్లోనూ ఇదే పరిస్థితి..

ప్రైవేటు ప్లాట్ల సంగతి ఇలా ఉంటే, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, అంతర్గత, ప్రధాన రహదారుల వెంట ఉన్న గ్రీన్‌బెల్టు తదితర స్థలాలు చెత్తకుండీలుగా, మురుగునీటి నిలయాలుగా మారుతున్నాయి. గుండ్లగడ్డ కబేలా నుంచి పాలకేంద్రం వరకు 60 అడుగుల రహదారి, రైలు పట్టాల మధ్య ఖాళీ స్థలం అనేక చోట్ల డంపుయార్డును తలపిస్తుంది. పందులు, కుక్కలకు ఈ ప్రాంతాలు ఆవాసాలుగా మారుతున్నాయి. నిర్మాణ వ్యర్థాలను, భోజన, ప్లాస్టిక్ వ్యర్థాలను ఈ దారిలో డంపు చేస్తున్నారు. ప్రతి ఏటా పట్టణ ప్రగతి, ఇతర ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల అమలు సందర్భంగా వీటిని శుభ్రం చేసేందుకు రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది. చినుకుపడితేజిపట్టణం ఎగువన ఉన్న చెరువు, కుంటలు నిండి పొర్లినపుడు తూర్పు వైపు ఉన్న కాలనీలకు వరద ముప్పు పొంచి ఉంది. ఇలాంటి చోట్ల వర్షాకాలం అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. "ఫ్రైడే.. డ్రైడే" వంటి పథకాలు నినాదాలకే పరిమితమవు తున్నాయి. మురికినీటి మడుగులుగా మారిన ప్లాట్లు దోమలకు అడ్డాగా మారుతున్నాయి. ఈ వానాకాలంలో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది.

# స్థిరాస్తి వ్యాపారానికి ఛార్జీల పెంపు గుబులు

మహబూబాబాద్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలో రిజిస్ట్రేషను ఛార్జీల పెంపుపై కసరత్తు ప్రారంభమైంది. ఇప్పటికే వ్యాపారం లేక ఇబ్బంది పడుతున్న పరిస్థితుల్లో భూమి విలువ పెంచితే అది ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. మధ్యతరగతి వారిపై మరింత ఆర్థిక భారం పడనుంది.

ఒకేసారి భారీగా.. గత ప్రభుత్వం 2021లో ఒకేసారి భారీగా రిజిస్ట్రేషన్లు, భూముల విలువను పెంచింది. అంతకు ముందు రిజిస్ట్రేషను ఛార్జీలు 6 శాతం ఉండగా 7.5 శాతానికి అంటే 1.5 శాతం పెరిగింది. దీనికి తోడు మార్కెట్ విలువను కూడా పెంచడంతో కొన్ని చోట్ల ఛార్జీలు రెట్టింపు అయ్యాయి. ఉదాహరణకు కాజీపేట మండలం ప్రశాంత్‌నగర్‌లో మార్కెట్ విలువ రూ.3 వేల నుంచి ఒకేసారి 9 వేలకు పెరిగింది. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని జిల్లా కేంద్రాల్లో కనీస ధర రూ. 2,500 ఉంది. అంటే ఎక్కడ భూమి కొన్నా రూ.90 వేల నుంచి రూ.లక్షకు పైగా ఖర్చు అవుతోంది.

తగ్గిన వ్యాపారం.. కరోనా తర్వాత ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 12 సబ్ రిజిస్ట్రేషను కార్యాలయాల్లో భారీ ఎత్తున రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఏటా రూ.350 కోట్లకు పైగా ఆదాయం వచ్చేది. గతేడాది ఆదాయం రూ.334 కోట్లకు పడిపోయింది. ఈ సంవత్సరం ఎన్నికలు, ప్రభుత్వ మార్పు, ప్రవాస భారతీయులలో కొనుగోలు ఆసక్తి తగ్గిపోవడం, విదేశాలలో ఉద్యోగాల ఊగిసలాటల ప్రభావం తీవ్ర ప్రభావం చూపింది. ఈ సమయంలో ఛార్జీలు పెంచితే వ్యాపారం మరింత తగ్గే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

ప్రతి సంవత్సరం పెంపు - హరికోట్ల రవి, జిల్లా రిజిస్ట్రారు

ప్రతి సంవత్సరం రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపు ఉంటుంది. 2021 నుంచి పెంపు జరగలేదు. ఈ సంవత్సరం ఆగస్టు 1 నుంచి పెంచే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కసరత్తు చేస్తున్నాం. మూడేళ్ల నుంచి పెంపు లేదు కాబట్టి దానికి అనుగుణంగా, శాస్త్రీయంగా ఉంటుంది.

నగరంలో స్థలం కొనలేరు - రియల్ వ్యాపారి గోకె కరుణాకర్

ఇప్పటికే నగరంలో మార్కెట్ విలువ ఎక్కువగా ఉంది. ఇంకా పెంచితే మధ్యతరగతి వారు నగరంలో స్థలం కొనలేని పరిస్థిత ఏర్పడుతుంది. గతంలో స్వల్పంగా ఛార్జీలు పెంచేవారు.. ఒకే సారి రూ.వేలల్లో పెంచడం వల్ల ఆర్థిక భారం ఎక్కువవుతుంది.

# మాతృక.. గిరిపుత్రులకు బాసట..!

చర్ల : రెవెన్యూ భూములు కాకుండా.. అటవీశాఖకు సంబంధం లేని మాతృక భూములను భూమిలేని అత్యంత నిరుపేద గిరిజనులకు పంపిణీ చేస్తే వారి జీవితాల్లో వెలుగులు నిండుతాయి. చర్ల మండలంలోని వివిధ గ్రామాల్లో ఇలాంటి భూములు దాదాపు వెయ్యి ఎకరాల వరకు పడావుగా ఉన్నాయి. నిరుపేద గిరిజనులకు అసైన్డ్ భూములను ఇప్పటికే వివిధ గ్రామాల్లో పంపిణీ చేసిన అధికారులు వారిని ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయించారు.

అప్పటి కలెక్టర్ చొరవతో..

చర్ల మండలంలోని మారుమూల బత్తినపల్లికి చెందిన 95 మంది గిరిజనులకు అప్పటి కలెక్టర్ అనుదీప్ చొరవతో గ్రామంలోని 311 ఎకరాలు, పులిగుండాలలో 291 ఎకరాల్లో అసైన్డ్ భూములకు స్థానిక అధికారులు పట్టాలు జారీ చేశారు. గిరిజనుల దశబ్దాల కల నెరవేరింది. గత మూడు దశాబ్దాలుగా వారు ఆ భూములకు పట్టాలు జారీ చేయాలని కోరుతూనే వచ్చారు. ఈ సమస్యపై అప్పట్లో 'ఈనాడు'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో అప్పటి జిల్లా పాలనాధికారి అనుదీప్ స్పందించడంతో గిరిజనుల జీవిత కల సాకారమైంది. అలానే మండలంలోని వివిధ గ్రామాల్లో మాతృక



భూములను భూమిలేని తమకు పంపిణీ చేయాలని నిరుపేదలు వేడుకుంటున్నారు.

కూలీ పనులే దిక్కు..మండలంలోని తిప్పాపురం, పూసుగుప్ప, ఉంజుపల్లి, వద్దిపేట, లెనిన్‌కాలనీ, సింగసముద్రం, కొయ్యూరు, సుబ్బంపేట, పెదమిడిసిలేరు, చినమిడిసిలేరు, కొత్తగట్ల, శ్రీనివాసపురం, కుదునూరు తదితర గ్రామాల్లో నిరుపయోగంగా మారిన మాతృక భూములతో పాటు అసైన్డ్ భూముల సర్వే అనంతరం పేదలకు పంపిణీ చేయొచ్చు. ఆయా గ్రామాల్లో అత్యంత నిరుపేదలు ఇప్పటికీ కూలీ పనులే జీవనంగా బతుకీడ్చుతున్నారు. వీరందరికీ భూ పంపిణీ జరగలాంటే.. కలెక్టర్ చొరవతోనే సాధ్యమవుతుంది. ఓ పక్క ప్రభుత్వం పోడుభూములకు హక్కులు కల్పించడం ద్వారా మన్యంలో వేలాది గిరిజన కుటుంబాలు లబ్ధి పొందాయి. అదేవిధంగా మాతృక భూములనూ పేద గిరిజనులకు పంపిణీ చేస్తే వారి జీవితాల్లో వెలుగులు నిండుతాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు సన్నద్ధం

మహబూబాబాద్ : జిల్లాలో ఇంకా ఎన్నికల వాతావరణం కొనసాగుతూనే ఉంది. వారం రోజుల కిందట లోక్‌సభ ఎన్నికలు ముగిశాయి. ఈనెల 27వ తేదీన నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం ఉప ఎన్నిక నిర్వహణకు సందడి ప్రారంభమైంది. ప్రధాన రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల విజయం కోసం విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నారు. అధికార యంత్రాంగం తమ విధి నిర్వహణలో భాగంగా జిల్లాలోని 18 మండలాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లు చేపట్టారు.

మూడు ఉమ్మడి జిల్లాల్లో 4,61,786 మంది ఓటర్లుగా నమోదుకాగా మహబూబాబాద్ జిల్లాలో 34,933 మంది ఉన్నారు. పురుషులు 22,948 మంది, మహిళలు 11,985 మంది ఉన్నారు.

ప్రతి మండల కేంద్రంలో ఆ మండలాల పరిధిలోని ఓటర్లు తమ హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలను నెలకొల్పారు. 18 మండలాల్లో 36 పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ముఖ్యంగా మహబూబాబాద్‌లో అధికంగా ఐదు పోలింగ్ కేంద్రాలుండగా తొర్రూరు, మరిపెడలో నాలుగు ఏర్పాటు చేశారు. మరో ఎనిమిది మండలాల్లో రెండు చొప్పున మిగిలిన ఏడు మండలాల్లో ఒక్కో పోలింగ్ కేంద్రాన్ని నెలకొల్పారు. ఈ నెల 27న నిర్వహించనున్న పట్టభద్రుల ఉప ఎన్నికలో విధులు నిర్వహించే అధికారులకు శిక్షణ ప్రక్రియను ప్రారంభించనున్నారు.

మహబూబాబాద్ డివిజన్ పరిధిలోని మండలాలకు జిల్లా కేంద్రంలోని ఫాతిమా హైస్కూల్, తొర్రూరు డివిజన్ పరిధిలోని మండలాలకు తొర్రూరులోని జడ్పీహెచ్‌ఎస్‌లో పోలింగ్ సామగ్రిని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పార్టీలు



ఎమ్మెల్సీ ఉప ఎన్నికలను ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. 2021లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారాస అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధించారు. ఆయన జనగామ ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో కాంగ్రెస్, భాజపా, భారాస పార్టీలు ఈ ఎన్నికల్లో విజయం సాధించేందుకు తమ ప్రచారాన్ని ముమ్మురం చేశారు. పట్టభద్రుల నియోజకవర్గానికి నాలుగుసార్లు ఎన్నిక నిర్వహించగా భారాస అభ్యర్థులే విజయం సాధించారు. ఆ పట్టును నిలుపుకొనేందుకు భారాస విశ్వప్రయత్నం చేస్తుంది. భారాస నుంచి ఏనుగుల రాకేష్‌రెడ్డిని పోటీలో నిలిపారు. గతంలో పోటీ భాజపా అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి మరోసారి పోటీ చేస్తున్నారు. నాటి ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన తీన్మార్ మల్లన్న ఈ సారి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

# ప్రయోగాలకు ఊతం నేతన్నలకు లాభం

సిరిసిల్ల : కాటన్ వస్త్రోత్పత్తులతో వినూత్న ప్రయోగాలకు జిల్లా వేదికగా ఉండేది. కెస్మెట్ రకం ఉత్పత్తుల్లో చెన్నై, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో సిరిసిల్లకు ప్రత్యేక స్థానం ఉంది. వీటికి అనుబంధంగా అద్దకం, సైజింగ్, గార్మెంట్ తయారీతో ఉపాధి అవకాశాలు లభించేవి. కాటన్ వస్త్రోత్పత్తులు, వాటి అనుబంధ రంగాలను కాపాడాలని గతంలో పలుమార్లు ప్రభుత్వాన్ని వస్త్రోత్పత్తిదారులు కోరినా ప్రయోజనం లేకుండా పోయింది. జిల్లా వస్త్ర పరిశ్రమను ఉపాధి సంక్షోభం నుంచి గట్టెక్కించాలంటే కాటన్ ఉత్పత్తులే ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నాయి. పాపిలిన్ రకం కాటన్ ఉత్పత్తులకు దేశవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. జిల్లాలోని మరమగ్గాల ఉత్పత్తి సామర్థ్యం, కార్మికుల పని తీరును బట్టి చూస్తే నెలకు పది లక్షల మీటర్లపైనే కొనుగోలు చేసే అవకాశం ఉన్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

ఆర్డర్లు తగ్గి.. పట్టుతప్పి

కాటన్‌లో పాపిలిన్ రకం మహారాష్ట్రలోని ఇచ్చల్‌కరంజి, చెన్నైలోని ఈరోడ్‌లో ఉత్పత్తి అవుతుంది. జిల్లాలోనూ ఏడేళ్ల క్రితం ఈ రకం తయారయ్యేది. ప్రభుత్వ ఆర్డర్లు పెరగడం, వాటి ఉత్పత్తి లక్ష్యాన్ని చేరడంలో సరైనా ప్రణాళిక లేక కాటన్ మగ్గాలను కూడా ఉత్పత్తి చేసేలా ఒత్తిడి పెంచారు. దీంతో ఇతర రాష్ట్రాల ఆర్డర్లు తగ్గాయి. క్రమంగా వస్త్రోత్పత్తిదారులు మార్కెటింగ్‌పైనా పట్టు కోల్పోయారు. ఒకప్పుడు పది వేలకు పైగా కాటన్ మగ్గాలపై కెస్మెట్, పాపిలిన్ రకం వస్త్రం నెలకు సగటున 20 లక్షల మీటర్లు ఉత్పత్తి అయ్యేది. దీనికి రంగుల అద్దకం, సైజింగ్, ప్రెసింగ్‌కు రాజస్థాన్‌లోని బల్వొత్రాకు పంపేవారు.

ఉపాధి విస్తరణ

మహిళల అండర్ గార్మెంట్ల తయారీకి పాపిలిన్ వస్త్రాన్ని ఉపయోగిస్తారు. దేశవ్యాప్తంగా అండర్ గార్మెంట్లు తయారు చేసే అపరెల్ యూనిట్ల నిర్వాహకులు ఈ వస్త్రాన్ని బల్వొత్రా నుంచి కొనుగోలు చేస్తారు. జిల్లాకు కూడా బల్వొత్రాలో రంగుల అద్దకం పూర్తయ్యాక తిరిగి వస్త్రాన్ని తెప్పిస్తారు. ఈ వస్త్రాన్ని ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లితోపాటు సిద్దిపేట, మంచిర్యాల, వరంగల్ జిల్లాల్లోని గార్మెంట్ యూనిట్లకు పీస్‌రేట్‌పై ఆర్డర్లు ఇస్తారు. వీటితో అండర్ గార్మెంట్స్ పెట్టీకోట్స్, బ్లౌజులు, పాల్స్, నైటీలు కుట్టిస్తారు. వీటిని హెూల్‌సేల్ వ్యాపారులు కొనుగోలు చేస్తుంటారు.

కార్మికులకు చేతినిండా పని

మరమగ్గాలపై కాటన్ వస్త్రోత్పత్తులను ఒక కార్మికుడు షిఫ్టులో సగటున 50 మీటర్లు నేస్తాడు. వీటితో పోలిస్తే పాలిస్టర్ ఉత్పత్తులు సులువు. కారణం ఒక కార్మికుడు పాలిస్టర్‌వి పది మగ్గాలను నడిపితే కాటన్ గరిష్ఠంగా అయిదుకు మించి నడపలేడు. కార్మికులకు పని భారం ఉన్నా మంచి వేతనంతో నిరంతరం ఉపాధి లభిస్తుంది. జిల్లాలో ప్రస్తుతం పాపిలిన్ వస్త్రం రెండు వేల మగ్గాలపై నెలకు 2.5 లక్షల మీటర్ల ఉత్పత్తి జరుగుతుంది. దీనిని పది వేల మగ్గాలకు పెంచి పది లక్షల మీటర్లు ఉత్పత్తి చేయాలని వస్త్రోత్పత్తిదారులు చూస్తున్నారు.

యువ పారిశ్రామికవేత్తల సొసైటీ

జిల్లాలో కాటన్ ఉత్పత్తులకు నూలును గుంటూరులోని స్పిన్నింగ్ మిల్లుల నుంచి దిగుమతి చేసుకొంటున్నారు. వస్త్రం ఉత్పత్తి అయ్యాక రంగుల అద్దకం, సైజింగ్‌కు బల్వొత్రాకు పంపుతున్నారు. దీంతో దిగుమతి, ఎగుమతులకు భారీగా ఖర్చులు, ప్రభుత్వానికి పన్నులు చెల్లించాల్సి వస్తోంది. దీనికి జిల్లాలోని 20 మంది యువ పారిశ్రామికవేత్తలు కలిసి ఇటీవల ఒక సొసైటీని ఏర్పాటు చేశారు. జిల్లాలోని వస్త్రోత్పత్తి సామర్థ్యానికి తగ్గట్టుగా అపరెల్ యూనిట్ ఏర్పాటుకు ప్రణాళికలు చేశారు. దీనికి ప్రభుత్వ సహకారం కోసం ఇటీవల అధికారంలో ఉన్న ముఖ్య నాయకులను కలిశారు. వారి సాయంతో ఉన్నతాధికారులను కలిసి తమ ప్రాజెక్టు నివేదికను వివరించేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో ముడి వస్త్రం ఉత్పత్తి నుంచి ఎగుమతి చేసే స్థాయికి తీసుకురావాలన్నది వీరి లక్ష్యం.

# పాఠశాలల్లో మృత్యు తీగలు!

గంగాధర : పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించేందుకు ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలలకు సొంత భవనాల నిర్మాణంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. నెలనెలా లక్షలాది రూపాయలు అద్దె రూపంలో చెల్లిస్తున్న ప్రభుత్వం.. కొన్నిచోట్ల స్థలం అందుబాటులో ఉన్నప్పటికీ భవనాల నిర్మాణం చేపట్టడం లేదు. ఫలితంగా అద్దె భవనాల్లో కొన్నిచోట్ల కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గురుకుల పాఠశాలల భవనాలపై వేలాడుతున్న విద్యుత్తు తీగలు మృత్యుపాశాలుగా మారుతున్నాయి.

వరుస ఘటనలతో ఆందోళన

గంగాధర మండల కేంద్రంలోని బీసీ బాలుర గురుకుల పాఠశాల భవనం పైనుంచి ఉన్న విద్యుత్తు తీగలు ఇటీవల తెగిపడగా ఇద్దరు విద్యార్థులు విద్యుదాఘాతానికి గురయ్యారు. అదే సమయంలో విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో విద్యార్థులకు ప్రాణాపాయం తప్పింది. పాఠశాల మైదానంలో అడుగు భాగాన తుప్పు పట్టిన ఇనుప స్తంభంతో ప్రమాదం పొంచి ఉంది. వర్షాకాలంలో ఇనుప స్తంభం తాకినా విద్యుత్తు ప్రమాదం జరిగే అవకాశం ఉంది. మైదానంలో విద్యార్థులు ఆటలు ఆడే క్రమంలో ప్రమాదం పొంచిఉంది. కాగా గంగాధర ప్రధాన కూడలి (మధురానగర్)లోని బీసీ బాలికల పాఠశాలలో గతంలో విద్యార్థుల దుస్తులు ఆరేయగా గాలికి కొట్టుకుపోయి భవనం పక్కనే ఉన్న విద్యుత్తు తీగలపై పడిపోయాయి. కర్రతో దుస్తులు తీసే క్రమంలో పాఠశాల స్వీపర్ విద్యుదాఘాతానికి గురై చేయి కోల్పోయారు. ఓ విద్యార్థిని పాఠశాల భవనం పైనుంచి కిందకు దూకగా గాయాలయ్యాయి. దీంతో భవనంపై అంతస్థుకు రెయిలింగు ఏర్పాటు చేశారు. ఇదే పాఠశాల భవనం ఆవరణలో బోరుబావి నుంచి విద్యుత్తు స్టార్టర్‌కు ఉన్న సర్వీసు తీగలు నేలపై ప్రమాదకరంగా ఉన్నాయి. పాఠశాల భవనం చుట్టూ వ్యర్థాలు పడేస్తుండగా అపరిశుభ్ర వాతావరణంతో దుర్వాసన వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు.

అంతా అస్తవ్యస్తం అసలే శిథిల భవనం.. ఆపై అస్తవ్యస్తంగా కనిపిస్తున్న విద్యుత్తు తీగలు.. ఇదీ జమ్మికుంటలోని బీసీ బాలుర వసతి గృహ పరిస్థితి. ప్రస్తుతం 30 మంది విద్యార్థులున్న ఈ వసతి గృహంలో విద్యుత్తు లైనింగ్ సరిగా లేక ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. తెగిపోయిన తీగులు.. అతికించేందుకు టేపు చుట్టిన దృశ్యాలు ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతున్నాయి. పలు గదుల్లోనూ విద్యుత్తు తీగలను పకడ్బందీగా బిగించకుండా తాత్కాలిక పనుల తో కాలం వెళ్లదీస్తున్నారు. వానాకాలంలో విద్యుత్తు ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉన్నందున తగిన మరమ్మతు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఆవరణలో కంచె లేని నియంత్రిక

రామడుగు ఆదర్శ పాఠశాల ఆవరణలో విద్యుత్తు నియంత్రిక చుట్టూ కంచె ఏర్పాటు చేయలేదు. నిత్యం వందలాది మంది విద్యార్థులు దీని పక్క నుంచే వెళ్తుంటారు. గ్రామానికి దూరంగా నిర్మించిన ఆదర్శ పాఠశాలకు సింగిల్ ఫేజ్ సరఫరా కోసం ప్రత్యేక లైన్ ఏర్పాటు చేశారు. ఇందుకు నియంత్రిక కూడా అమర్చినా కంచె ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదకరంగా దర్శనమిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

# మెమోలతోనే కాలయాపన



మల్యాల : నిధుల దుర్వినియోగానికి అప్పటి ఈవో వెంకటేశ్‌తో పాటు ఏఈవో, ఇద్దరు సూపరింటెండెంట్లు బాధ్యులేనని పరిపాలనా లోపం బాధ్యతారాహిత్యంతోనే నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డట్లు పేర్కొంటూ దేవాదాయశాఖ కమిషనరు మార్చి 23న ఈవోను సస్పెండ్ చేశారు. మిగిలిన ఏఈవో, ఇద్దరు సూపరింటెండెంట్లకు ఛార్జి మెమోలు జారీ చేసినా ఇప్పటి వరకు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఆడిట్ విచారణ పూర్తయిందా ఇంకా ఏమైనా నిధుల దుర్వినియోగం జరిగిందా అన్న విషయాలను ఉన్నతాధికారులు ఇప్పటి వరకు వెల్లడించలేదు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో నిధుల దుర్వినియోగం జరిగినట్లు తేలినా బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొండగట్టులో వ్యాపారుల నుంచి ఆలయ ఉద్యోగి లక్షలాది రూపాయలు వసూలు చేసి సొంతానికి వాడుకున్నట్లు తేలడంతో మార్చి 19న దేవాదాయశాఖ ఏడీసీ జ్యోతి విచారణ చేపట్టారు. పూర్తిస్థాయిలో ఆడిట్ నిర్వహించేందుకు కార్యాలయంలోని రికార్డులను తీసుకెళ్లారు. ఆడిట్ నిర్వహించిన అధికారులు ఆలయానికి చెందిన దాదాపు రూ.53 లక్షలు ఆలయ సీనియర్ సహాయకుడు స్వాహా చేసినట్లు వెల్లడించడంతో అతడిని సస్పెండ్ చేయడంతోపాటు పోలీసులు కేసు నమోదు చేసి 20 రోజుల కిందట రిమాండుకు పంపించారు.

కాలపరిమితి ముగిసినా వేతనాల చెల్లింపు

కొండగట్టులో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేసే 11 మంది సెక్యూరిటీ సిబ్బంది కాలపరిమితి 2023 మార్చి 31 నాటికి ముగిసినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగించారు. అంతేకాకుండా వారికి ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు ప్రతి నెలా దాదాపు రూ.80 వేల చొప్పున ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీకి కాకుండా నేరుగా ఆలయ నిధుల నుంచి వేతనాలు చెల్లించారు. ఈ తతంగంలో ఇద్దరు సూపరింటెండెంట్లపై శిక్షాపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టరు దేవాదాయశాఖ అధికారులను ఆదేశించారు. వారిద్దరిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఈవోకు ఉత్తర్వులు జారీ చేశారు. అయినా ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై భక్తులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు.

పాతుకుపోయిన సిబ్బంది

ఆలయంలో పనిచేసే కొందరు ఉద్యోగులు 15 నుంచి 20 ఏళ్లపాటు ఇక్కడి నుంచి బదిలీ కావడం లేదు. ఒకవేళ బదిలీ అయినా పైరవీలతో మళ్లీ ఇక్కడికే వస్తున్నారు. కొందరు ఉద్యోగులు స్థానిక వ్యాపారులతో అంటకాగుతూ సకాలంలో ఆలయానికి చెల్లించాల్సిన లీజు టెండరు డబ్బులను వసూలు చేయకపోవడం, ఆలయ ఖాతాలో జమ చేయడంలో పూర్తిగా విఫలమతున్నా ఉన్నతాధికారుల చర్యలు అంతంతమాత్రమేనని పలువురు పేర్కొంటున్నారు.

కమిషనర్‌కు పంపించాం – చంద్రశేఖర్, ఈవో

లీజు టెండరు వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేసి ఆలయ ఖాతాలో జమచేయకుండా దుర్వినియోగం చేసిన సీనియర్ సహాయకుడిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. నిధుల దుర్వినియోగానికి బాధ్యులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు, సిబ్బందిపై ఛార్జెస్ ఫ్రేమ్ చేసి ఎండోమెంట్ కమిషనరుకు పంపించాం. ఆడిట్‌కు సంబంధించి పూర్తి నివేదిక రాలేదు. ఆలయంలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీ చేయడానికి కమిషనరుకు నివేదిక అందజేశాం. నిబంధనలకు విరుద్ధంగా సెక్యూరిటీ సిబ్బందికి వేతనాలు చెల్లించిన ఇద్దరు సూపరింటెండెంట్లపై చర్యలకు పరిశీలిస్తున్నాం.

# మత్స్య సంపదకు ఊతం



కరీంనగర్ : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మత్స్య సంపదను పెంపొందించడంతో పాటు చేపలు పట్టి జీవించే మత్స్య కార్మికులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాల ద్వారా రాయితీ కల్పిస్తోంది. దానికి తోడు ప్రతి పారిశ్రామికుడికి ప్రభుత్వమే ప్రీమియం డబ్బులు చెల్లించి అయిదు నెలల వరకు బీమాతో దీమా ఇస్తుంది. బుధవారం జాతీయ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం మత్స్య సంపదకు చేస్తున్న కృషిపై కథనం.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాళేశ్వరం, ఎల్లంపల్లి, దిగువ, ఎగువ మానేరు, మధ్యమానేరు వంటి సాగునీటి ప్రాజెక్టులు ఉన్నాయి. వీటివల్ల భూగర్భ జలాలు పెరగడమే కాకుండా చెరువులు, కుంటల్లో నీరు నిలువ ఉండే అవకాశం కలుగుతుంది. దీంతో మత్స్య సంపదకు, చేపల ఉత్పత్తికి ప్రాధాన్యం పెరిగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏడు కోట్లకు పైగా పలు రకాల చేప పిల్లలు, 80 లక్షల వరకు రొయ్య పిల్లలను ఉచితంగా జలాశయాలు, చెరువులు, కుంటల్లో ప్రభుత్వం వదిలి చేయూతనిస్తుంది. దాదాపు 20 టన్నుల చేపల దిగుబడి వస్తుంది. ఇక్కడ పెరిగిన చేపలు రొయ్యలను కలకత్తా, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. కేజీ కల్చర్ ద్వారా పెంచిన తిలాపియా చేపలను కూడా ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

లైసెన్స్‌లు జారీ

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కార్యక్రమం ద్వారా కూడా చేయూతనిస్తున్నారు. చేపల చెరువుల నిర్మాణానికి యూనిట్‌కు రూ.7 లక్షలు, చేప పిల్లల పెంపకానికి రూ.6 లక్షలు, హెచరీస్ నిధులు సమకూర్చుతున్నారు. వీటిని ఏర్పాటు చేసుకునే ఎస్సీ, ఎస్టీలతో పాటు మహిళలకు 60 శాతం, ఇతరులకు 40 శాతం రాయితీ ఇస్తున్నారు. ఇవికాకుండా జలాశయంలో కేజీ కల్చర్ విధానంలో చేపలను పెంచే వారికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుంది. చేపల చెరువుల నిర్మాణానికి, చేపపిల్లల పెంపకం కేంద్రాలకు దరఖాస్తులు కూడా తీసుకొని మంజూరుకు ప్రభుత్వానికి పంపించారు. దిగువమానేరు జలాశయంలో చేపలు పట్టుకునేందుకు 905 మందికి లైసెన్స్‌లు జారీ చేశారు. కరీంనగర్ జిల్లాలో 50 వేల మంది మత్స్య పారిశ్రామికులకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి ప్రమాదబీమా సౌకర్యం కల్పిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని అమలు చేస్తుండగా వీరందరి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.అయిదు లక్షలు చెల్లిస్తున్నారు. ఇప్పటి వరకు 20 కుటుంబాలకు అందజేశారు.

రాయితీపై వాహనాలు

మత్స్యకార్మికులకు వలలు, బుట్టలు, ఐస్‌బాక్స్‌లు వంటి వాటితో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాహనాల కొనుగోళ్లకు రాయితీ ఇస్తున్నాయి. ద్విచక్ర వాహనాలు ఆటోలు, మొబైల్ వాహనాలకు 60 శాతం రాయితీ, కొందరికి 40 శాతం రాయితీ ఇచ్చి కొనుగోళ్లు చేయించారు. దీంతో పట్టుకున్న చేపలను వెంటనే గ్రామాలకు, మార్కెట్లకు వెళ్లి విక్రయించడానికి మార్గం సులభతరమవుతుంది. మరికొన్నింటికి కూడా రాయితీ ఇస్తున్నారు. మత్స్య కార్మికుల్లో మహిళకు 60 శాతం రాయితీ ఇచ్చారు. చేయూతకు ప్రభుత్వం కృషి

– విజయ, సహాయ సంచాలకురాలు, కరీంనగర్


చెరువులు, కుంటలు, జలాశయాల్లో చేపపిల్లలు పెంచేందుకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసేందుకు కార్యాచరణ రూపొందించి ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ అయ్యాయి. మత్స్య శ్రామికులకు చేయూతనివ్వడానికి ప్రభుత్వం రాయితీపై పలు కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఆర్థికాభ్యున్నతి సాధించేలా సద్వినియోగం చేసుకోవాలి.

# పంట రుణమాఫీపై కదలిక

హుజూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పంట రుణ మాఫీపై అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా సహకార సంఘాల పరిధిలోని డీసీసీబీ, ఎస్బీఐ బ్యాంకుల్లో రూ.2 లక్షలలోపు పంట రుణం తీసుకున్న రైతుల వివరాలను అధికారులు సేకరించారు. ఆయా బ్యాంకుల రికార్డుల ఆధారంగా రైతుల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. ఎట్టకేలకు రుణమాఫీపై కదలిక రావడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ఎనిమిది సహకార సంఘాల్లో..

ఆగస్టు 15వ తేదీలోగా రూ.2 లక్షల పంట రుణాన్ని మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు తీసుకున్న రుణాలను మాఫీ చేసేందుకు జిల్లా యంత్రాంగం ఇప్పటికే కసరత్తు పూర్తి చేసింది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని ఎనిమిది సహకార సంఘాల పరిధి డీసీసీబీ, ఎస్బీఐ బ్యాంకుల ద్వారా రూ.2 లక్షల పంట రుణాలు తీసుకున్న రైతుల వివరాలను సేకరించేందుకు ఇటీవల సహకార శాఖ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో వివరాలను నమోదు చేశారు. జమ్మికుంట, తనుగుల, ఇల్లందకుంట, మల్యాల, బోగంపాడు, శంకరపట్నం మండలంలోని మెట్‌పల్లి, జగిత్యాలలోని కోనాపూర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పెద్దూరు సహకార సంఘాల్లో రైతు రుణాలపై వివరాలను సేకరించేందుకు ప్రతీ సంఘానికి ఇద్దరు చొప్పున ఎనిమిది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆయా సంఘాల పరిధిలో రూ.2 లక్షల లోపు పంట రుణాలు తీసుకున్న రైతులు ఎంతమంది ఉన్నారనే విషయంపై డీసీసీబీ, ఎస్బీఐ రికార్డుల ఆధారంగా వివరాలు



సేకరించి యాప్‌లో నమోదు చేశారు. ఈ ప్రక్రియ రెండ్రోజుల క్రితమే పూర్తయింది. ప్రతీ సంఘం పరిధిలో 250 నుంచి 300 మంది రైతులు ఉన్నట్లు గుర్తించి ప్రభుత్వానికి నివేదించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎనిమిది సహకార సంఘాల పరిధిలోని ఆయా బ్యాంకుల్లో 2,000 నుంచి 2,400 మంది అన్నదాతలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిసింది. వీరందరిని రుణమాఫీకి అర్హులుగా నివేదించారు. దీనిపై కరీంనగర్ జిల్లా జాయింట్ రిజిస్ట్రార్, డీసీవో ఎస్.రామాంజనేయచార్య మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని ఆరు సహకార సంఘాల పరిధిలో డీసీసీబీ, ఎస్బీఐ ద్వారా రూ.2 లక్షల లోపు పంట రుణాలు తీసుకున్న రైతుల వివరాలను సేకరించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేశాం. ఈ వివరాలు నేరుగా ప్రభుత్వానికే వెళ్తాయని చెప్పారు.

# మరమ్మతులకే డబ్బుల్లేవు.. చెత్త తరలించేదెలా?

సారంగాపూర్: 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నుంచి కొంత కాలంగా నిధులు రావడంలేదు. మొన్నటి వరకు సర్పంచులు ఉంటే వారే చూసుకునే వారు. ఇప్పటికే జేబుల నుంచి డబ్బులు పెట్టి పనులు చేయించాం. వచ్చే జీతం అరకొర ఉంటుంది. దీనికి తోడు గ్రామస్థుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. గత ప్రభుత్వం తీసుకున్న ట్రాక్టర్ల కిస్తీలు కట్టకపోవడంతో బ్యాంకు అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. చిన్న పంచాయతీలు కావడంతో ఎలాంటి ఆదాయ మార్గాలు లేక పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించలేకపోతున్నాం. అక్కడిక్కడ అప్పుచేసి అంతోఇంతో చెల్లిస్తూ నెట్టుకొస్తున్నాం. ఇలా ఎన్ని నెలలు భారం మోయమంటారంటూ జిల్లాలోని చిన్న పంచాయతీ కార్యదర్శుల ఆవేదన.' బీర్‌పూర్ మండలంలోని చిన్న కొల్వాయిలో 102 జనాభా కలిగి ఉండగా కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతి నెల కేవలం రూ.12 వేలు వస్తుంది. ఇందులో ట్రాక్టర్ కిస్తీకే రూ.10 వేలు చెల్లిస్తుండగా, పంచాయతీ కార్మికుడికి రూ.9,500లు చెల్లించాల్సి ఉంటుంది. మిగతా ఖర్చులు, ట్రాక్టర్ మరమ్మతులు, క్లోరినేషన్, తదితర అవసరాలకు నిధులు ఎక్కడి నుంచి తీసుకురావాలి.

సారంగాపూర్ మండలంలోని నాయకపుగూడెం పంచాయతీ ట్రాక్టర్ మరమ్మతులకు మూడు నెలలుగా డబ్బులు లేకపోవడంతో మూలన పడేశారు. పంచాయతీ పరిధిలో ఇంటింటి చెత్త సేకరణ చేయకపోవడంతో గ్రామస్థులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పక్కనే ఉన్న సారంగాపూర్ పంచాయతీ ట్రాక్టర్ తీసుకొచ్చి చెత్తను సేకరించాల్సి వస్తోంది. పారిశుద్ధ్య నిర్వహణకు గత ప్రభుత్వం చెత్తను తరలించేందుకు ప్రతి పంచాయతీకి ట్రాక్టర్‌తోపాటు ట్యాంకర్, ఇతర పనిముట్లు కొనుగోలు చేసింది. ట్రాక్టర్ల కిస్తీల రుణ చెల్లింపు చిన్న పంచాయతీలకు మోయలేని భారంగా మారింది. ఆదాయ మార్గాలు లేక బ్యాంకు కిస్తీలు చెల్లించలేని దయనీయ పరిస్థితి నెలకొంది. పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించలేని దుర్భర పరిస్థితి. జిల్లాలో 380




పంచాయతీలు ఉండగా గత ప్రభుత్వం దాదాపుగా 60 తండాలను పంచాయతీలుగా మార్చింది. ఆయా పంచాయతీలలో నెలసరి వచ్చే నిధులు కిస్తీలు, పారిశుద్ధ్య కార్మికుల చెల్లింపులకు సరిపోవడం లేదు. దీనికి తోడు నిధులు నిలిచిపోవడంతో పంచాయతీ కార్యదర్శులకు భారంగా మారింది. కుంటుపడుతున్న అభివృద్ధి

పంచాయతీలలో అభివృద్ధి పనులతోపాటు పారిశుద్ధ్యంపై అధికారులు చేతులెత్తేస్తున్నారు. చిన్న పంచాయతీలలో వసూలయ్యే ఏడాది ఇంటి పన్ను కేవలం రెండు, మూడు నెలల ట్రాక్టర్ కిస్తీలకు సరిపోవడంలేదు. విద్యుత్తు బకాయిలు, మరమ్మతులకు, క్లోరినేషన్ తదితర అవసరాలకు నిధులు సమకూరక అభివృద్ధి కుంటుపడుతుంది. ఏదైనా ప్రత్యేకంగా నిధులు పంచాయతీలకు జమ చేస్తే తప్పా గ్రామాల్లో పనులు చేసే పరిస్థితి లేదు. ప్రస్తుతం వర్షాకాలంలో కాలానుగుణ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున క్లోరినేషన్, పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించాలని ఉన్నతాధికారుల ఆదేశాలను అధిగమించేందుకు గ్రామస్థాయి అధికారులు నానాపాట్లు పడాల్సి వస్తోంది.

ఇబ్బందులు లేకుండాచూస్తున్నాం– రామకృష్ణరాజు, ఎంపీవో, బీర్‌పూర్

చిన్న పంచాయతీలకు నిధులు రాకపోవడంతో ఎక్కడా ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ట్రాక్టర్ బకాయిలకు కిస్తీలు కొంత మొత్తంలో చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం మరో రెండు, మూడు నెలలు గడిస్తే ట్రాక్టర్ బకాయిలు పూర్తవుతాయి. పారిశుద్ధ్య, క్లోరినేషన్‌ను ఎప్పటికప్పుడు చేస్తూ ప్రజలకు పరిశుభ్ర వాతావరణాన్ని అందించడానికి కృషి చేస్తున్నాం.

# వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభం

కరీంనగర్: సంప్రదాయ కోర్సులకు కాలం చెల్లింది.. బీటెక్‌లో కొత్త కోర్సుల హవా కొనసాగుతోంది. గడిచిన కొన్నేళ్లుగా ఇంజినీరింగ్ విద్య కొత్త పుంతలు తొక్కుతోంది. సమకాలీన అంశాలతో ముడిపడి.. ఉద్యోగావకాశాల డిమాండ్ ఉన్న వాటివైపే విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు. చదువరుల ఆసక్తికి అనుగుణంగానే కళాశాల ల్లోనూ సమున్నత అవకాశాలు వచ్చి చేరుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ కళాశాలలు 3, ప్రైవేటువి 9.. మొత్తం కలిపి 12 ఇంజినీరింగ్ కళాశాలలు మాత్రమే ఉన్నాయి. గత విద్యా సంవత్సరం సుమారు 10వేలకుపైగా విద్యార్థులు వీటిలో చదువుతున్నారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 18,125 మంది ఉత్తీర్ణత సాధించగా టీజీ ఎప్‌సెట్ (ఎంసెట్)ను 6వేల మంది రాశారు.

వీటికి ఆదరణ!

సాధారణ ఇంజినీరింగ్ కోర్సులకు యువత స్వస్తి పలుకుతున్నారు. సివిల్, మెకానికల్, ఐటీ ఇంజినీరింగ్ కోర్సుల్లో గతంలో మాదిరిగా ఎక్కువ మంది చేరడం లేదు. దీంతో ఎక్కువగా వేటికి డిమాండ్ ఉన్నవని గుర్తించి కళాశాలలు కూడా వాటిని అందుబాటులోకి తెస్తున్నాయి. ముఖ్యంగా సిరిసిల్లలో నేత కార్మికులకు ఉన్న అవకాశాల నేపథ్యంలో అక్కడి జేఎన్టీయూలో టెక్స్‌టైల్స్ ఇంజినీరింగ్ కోర్సు ప్రవేశ పెట్టారు. గోదావరిఖని, రామగుండం సింగరేణి ప్రాంతమవడంతో ఇక్కడి ప్రాంతం వారికి అవకాశాలు లభించాలనే ఉద్దేశంతో మైనింగ్ ఇంజినీరింగ్ కోర్సు మంథని జేఎన్టీయూలో అందుబాటులోకి తెచ్చారు. ఇప్పుడంతా ఏఐ ట్రెండ్‌కు ప్రాధాన్యం ఉండటంతో ప్రైవేటు కళాశాలలు ఆ కోర్సులపై దృష్టి పెట్టాయి. ఏఐఎం (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్) రూపంలో కొన్ని సీట్లున్నాయి. సీఎస్ఈ కోర్సుకు అదనంగా కంప్యూటర్ ఆధారితంగా ఇంకొన్ని అదనపు కోర్సులను ప్రవేశ పెట్టారు. సీఎస్‌జీ (కంప్యూటర్ సైన్స్ ఆండ్ డిజైన్), సీఎస్ఎం (కంప్యూటర్ సైన్స్ ఆండ్ ఇంజినీరింగ్–ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ మిషన్ లర్నింగ్), సీఎస్‌డీ (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (డాటాసైన్స్), సీఎస్ఐ (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)లు సీఎస్ఈ (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్) కోర్సుతో పోటీ పడబోతున్నాయి. ఇక ఎప్పటి మాదిరిగానే ఈసీఈ (ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, ఈఈఈ (ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్), సివిల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సులలో సీట్లున్నాయి. కన్వీనర్ కోటా సీట్లు.. 3,624 నుంచి వెబ్ ఆప్షన్ల ప్రక్రియ మొదలవ దంతో ఉమ్మడి జిల్లా విద్యార్థులు హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న కళాశాలలతోపాటు స్థానికంగా ఇక్కడ ఉన్న కళాశాలల్లో కోర్సులకు దరఖాస్తు చేసుకుంటున్నారు. కొడిమ్యాల, మంథని, అగ్రహారంలో ఉన్న జేఎన్టీయూ ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలల్లో మొత్తం సీట్లు కన్వీనర్ కోటా కింద భర్తీ చేయనున్నారు. ఇవి కాకుండా మిగతా ప్రైవేటు కళాశాలల్లో కన్వీనర్ కోటా సీట్లను ఉన్నతాధికారులు విడుదల చేశారు. మొత్తంగా ప్రస్తుత కౌన్సెలింగ్‌లో ఉమ్మడి జిల్లాలోని అన్ని కళాశాలల్లో కలిపి 3,624 కన్వీనర్ కోటాలో సీట్లున్నాయి.

# సకాలంలో అందేనా!

కోరుట్ల: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ఇప్పటికే పలు పథకాలలో భాగస్వామ్యం చేయగా ప్రస్తుతం ఏకరూప దుస్తుల తయారీ బాధ్యతలను అప్పగించారు. ఇటీవల ప్రభుత్వం మహిళలకు వడ్డీలేకుండా రూ.కోటి రుణాలు అందిస్తామని ప్రకటించడమే కాకుండా అన్ని శాఖల దుస్తుల తయారీ, ప్రభుత్వ పాఠశాలల ఏకరూప దుస్తుల తయారీ చేసేందుకు కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్, కస్తూర్బా, ఆదర్శ తదితర పాఠశాలలు దాదాపు 853 వరకు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో చదివే బాలబాలికలకు ప్రభుత్వం ఏకరూప దుస్తులను పంపిణీ చేస్తుంది. జిల్లా వ్యాప్తంగా 72 కేంద్రాలను మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేసి 1,61,763 ఏకరూప దుస్తుల తయారీకి అధికారులు ప్రణాళికలు తయారు చేశారు. జూన్ 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానుండగా వచ్చేనెల 11లోపు దుస్తుల తయారీ పూర్తి చేయాలని భావిస్తున్నప్పటికీ వస్త్రం ఆదివారం జిల్లాకు చేరుకోవడంతో మహిళా సంఘాలపై ఒత్తిడి పెరిగే అవకాశముందని వాపోతున్నారు.



విద్యాసంవత్సరం ప్రారంభానికి విద్యార్థులకు అందుతాయా? లేదా? అని ప్రశ్నార్థకంగా మారింది. కుట్టు కేంద్రాలలో అధికారులు పర్యవేక్షణ పెంచి తయారీని వేగవంతం చేయాల్సిన అవసరముంది.

జిల్లాలో 72 కేంద్రాల్లో..

జిల్లాలో 380 గ్రామాలతోపాటు జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్ పురపాలికలు ఉన్నాయి. వీటికి అనుగుణంగా డీఆర్డీవో, మెప్మా ఆధ్వర్యంలో 1417 మంది స్వశక్తి మహిళలతో 72 కుట్టు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలలో 840 కుట్టు యంత్రాలను అందుబాటులో ఉంచారు. ఇందులో పంచాయతీలలో 67 కేంద్రాలను ఏర్పాటు చేసి 988 మంది స్వశక్తి మహిళలను ఎంపిక చేసి 1,20,822 ఏకరూప దుస్తులు, మున్సిపల్ పరిధిలో అయిదు కేంద్రాలను ఏర్పాటు చేసి 429 మందితో 40,941 దుస్తులను తయారీ చేయనున్నారు. గత ఏప్రిల్‌లో సెలవులు రాక ముందే స్వయం సహాయక సంఘాల ద్వారా ఏర్పాటు చేశారు. గతంలో ఏజెన్సీ, స్థానిక దర్జీలకు దుస్తులు కుట్టే అవకాశం కల్పించగా ప్రస్తుతం పూర్తిగా స్వశక్తి సంఘం మహిళలకే కేటాయించారు. కుట్టిన వస్త్రానికి కేవలం రూ.50 చొప్పున మాత్రమే చెల్లించేందుకు నిర్ణయించడంతో గిట్టుబాటు అవ్వడం కష్టంగా ఉందని మహిళలు వాపోతున్నారు. ఇప్పటికే పాఠశాలల్లో స్వశక్తి సంఘాల్లోని మహిళలను అమ్మ ఆదర్శ కమిటీలలో సభ్యులుగా చేర్చడంతో ప్రభుత్వ పాఠశాలల్లో మహిళల భాగస్వామ్యం పెరనుందని భావిస్తున్నారు.

పాఠశాలల ప్రారంభానికి ముందే..

వస్త్రం అందించడంలో ఆలస్యం కావడంతో ముందుగా ఒక జత అందించేందుకు ప్రతి మండలంలో రెండు నుంచి నాలుగు కుట్టు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏటా ప్రభుత్వం ఏడాదికి రెండు జతల చొప్పున విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందిస్తున్నారు. ముందుగా ఒక జత అందించేందుకు మండలానికి ఒక ప్రత్యేకాధికారిని నియమించడమే కాకుండా ఎంఈవో, డీఆర్డీవో, ఏపీఎంలతోపాటు 64 మంది సీసీ క్లస్టర్ల పరిధిలో కుట్టు కేంద్రాలను పర్యవేక్షిస్తూ వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఏటా అందించే ఏకరూప దుస్తులలో నాణ్యత ఉండకపోవడమే కాకుండా చిన్నపిల్లలకు పెద్ద సైజులో, పెద్ద వారికి చిన్న సైజులో అందించడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతుండేవారు. ఈసారి అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారుల పర్యవేక్షణ పెంచి, ముందు నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని, పాఠశాలలు ప్రారంభానికి ముందే అందించేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఒక జత అందించేలా చర్యలు

జిల్లా వ్యాప్తంగా సెర్ప్ ద్వారా 67, మెప్మా ద్వారా అయిదు కేంద్రాలను ఏర్పాటు చేసి, స్వయం సహాయక సంఘాల ద్వారా ఏకరూప దుస్తుల తయారీకి చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం జిల్లాకు వస్త్రం చేరుకోవడంతో కుట్టు పనులు ప్రారంభించి, ముందుగా ఒక జత అందించేలా ప్రణాళిక తయారు చేశాం. మల్లేశం, డీపీఎం, జగిత్యాల

## పొదుపు పద్దులో అక్రమాలకు అడ్డుకట్ట

పెద్దపల్లి : స్వయం సహాయక సంఘాలకు రుణాల పంపిణీలో పారదర్శకత పాటించేందుకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) అవసరమైన చర్యలు తీసుకుంటోంది. మహిళా సాధికారతకు వినియోగించే ప్రతి పైసాకు లెక్క చూపేందుకు కార్యాచరణ చేపట్టింది. అతివల పొదుపు ప్రాతిపదికన బ్యాంకర్లు లింకేజీ రుణాలు మంజూరు చేస్తున్నారు. సభ్యులు వాటిని నెల వారీ కిస్తుల రూపంలో తిరిగి చెల్లిస్తున్నారు. లింకేజీతో పాటు స్త్రీనిధి, గ్రామైక్య, మండల సమాఖ్యల నుంచి కూడా మహిళలు రుణాలు పొందుతున్నారు. బ్యాంకు లింకేజీ రుణాల విషయంలో పెద్దగా సమస్య లేదు. గ్రామైక్య, స్త్రీనిధి రుణాలకు మాత్రం ప్రతి సంవత్సరం ఆడిట్ నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం నియమించిన ఆడిటర్లు దస్త్రాలతో కుస్తీ పడుతున్నారు. ఈ నెలాఖరులోగా శత శాతం ఆడిట్ చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

నెలాఖరులోగా పూర్తికి ఆదేశాలుగ్రామైక్య సంఘాల రుణాల పంపిణీపై ఆడిటర్లు నిశితంగా పరిశీలిస్తున్నారు. ప్రతి వీవోకు అధ్యక్షురాలు, కార్యదర్శి, కోశాధికారి ఉంటారు. క్షేత్ర స్థాయిలో వీవోఏ(విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్) ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో దస్త్రాలను నమోదు చేస్తున్నారు. కొన్ని చోట్ల వీవోఏలు, సంఘాల కార్యవర్గ సభ్యులతో కుమ్మక్కై సొమ్ము స్వాహా పర్వానికి పాల్పడుతున్నారు. దీంతో సంఘాల నగదు నిల్వ, జమ, ఖర్చులపై ఆడిటర్లు ఆరా తీస్తున్నారు. ఆన్‌లైన్‌లోనూ పరిశీలిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 61 మండల సమాఖ్య, 1,955 గ్రామైక్య సంఘాల పరిధిలో 49,448 స్వశక్తి సంఘాల లావాదేవీలు నిర్వహిస్తున్నారు. నెలాఖరులోపు ఆడిట్ నివేదికలు పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలున్నాయి. కాగా ఆడిట్ ప్రక్రియపై ఎండల తీవ్రత ప్రభావం చూపింది. దస్త్రాల తనిఖీల్లో వ్యత్యాసం ఉంటే ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు. అవకతవకలు తేలితే బాధ్యుల నుంచి సొమ్ము రికవరీ చేయాల్సి ఉంటుంది.

ప్రతి పైసాకూ లెక్కస్వశక్తి సంఘాల మహిళలు పొదుపులో ఆదర్శంగా నిలుస్తున్నారు. వారి ఆర్థిక అభ్యున్నతికి మండల, గ్రామైక్య సంఘాలు కూడా రుణాలు ఇస్తున్నాయి. పలు చోట్ల నిధులు పక్కదారి పడుతున్నాయనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

# వీళ్లు మారరు వసూళ్ల పర్వం ఆపరు!



వరంగల్ : ఉమ్మడి వరంగల్‌లోని అనేక మండలాల పరిధిలో రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది వసూళ్ల పర్వంలో మునిగితేలుతున్నారు. ప్రజలు వీరికి ఆమ్యామ్యాలు చెల్లించలేక చివరకు అవినీతి నిరోధక శాఖ (అనిశా)ను ఆశ్రయిస్తున్నారు. కొన్నేళ్ల అనిశా కేసులను పరిశీలిస్తే రెవెన్యూ శాఖవారే ఎక్కువగా పట్టుబడుతుండటం దీనికి నిదర్శనం.

రైతులను వేధిస్తూ

కమలాపూర్ తహసీల్దారు కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది గతంలోనూ అనేక మంది రైతుల వద్ద భారీగా లంచాలు వసూలు చేసినట్టు ఫిర్యాదులు ఉన్నాయి. కమలాపూర్ హనుమకొండ నగరానికి దగ్గరగా ఉండడంతో భూముల ధరలు ఎక్కువగా ఉంటాయి. దీంతో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన రైతుల నుంచి భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. స్థిరాస్తి వ్యాపారాన్ని ఆసరా చేసుకొని కూడా రూ.లక్షలు వసూలు చేస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. వ్యవసాయేతర భూమి (నాలా)గా మార్చాలని దరఖాస్తు చేసుకోగా రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు దండుకోవడం చర్చనీయాంశమవుతోంది.

ఇదే కార్యాలయంలో పనిచేసే మరికొందరు సిబ్బంది ఏడాది కిందట ఓ మేజర్ పంచాయతీలో రూ.లక్షల్లో డబ్బులు దండుకొని కుటుంబ సభ్యులకు కాకుండా వేరే వ్యక్తికి ఫ్యామిలీ మెంబర్ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఇటీవల ఈ పంచాయితీ పోలీసు స్టేషన్ వరకు వెళ్లడంతో ఓ రాజకీయ నాయకుడు మధ్యవర్తిగా బాధితురాలిని ఒప్పించి రూ.మూడు లక్షలకు సెటిల్ చేయడం గమనార్హం.

కేసుల్లో పెరుగుదల ఇటీవల అనిశా అధికారులు అవినీతిపరులపై దృష్టిసారిస్తుండడంతో బాధితులు ఫిర్యాదు ఇవ్వగానే వల పన్ని పట్టుకుంటున్నారు. ఈ క్రమంలో కేసుల సంఖ్యలో పెరుగుదల కనిపిస్తోంది. ఈ ఏడాది ఇప్పటికే ఏడు కేసులు నమోదయ్యాయి. కేసుల్లో రెవెన్యూ శాఖే అగ్రస్థానంలో నిలుస్తోంది. గత మూడేళ్లలో 27 కేసులు నమోదవ్వగా వీరిలో ఏడుగురు వారే ఉన్నారు.

రెవెన్యూ శాఖ ఒక్కటే కాదు.. పోలీసు, పురపాలక, రిజిస్ట్రేషన్లు, పంచాయతీ రాజ్ శాఖల్లోనూ అవినీతి పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తమవుతోంది. చాలా చోట్ల లంచం ఇస్తేనే పని జరిగే పరిస్థితి ఉంది. పై స్థాయి అధికారులు తమ కింది సిబ్బంది ద్వారా వసూళ్లకు పాల్పడుతున్నారని.. ఒకవేళ అనిశా దాడులు జరిగినా తెలివిగా తప్పించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అనిశా అధికారులు పోలీసు శాఖపైనా దృష్టి పెట్టాల్సి ఉంది.

ఏం జరిగిందంటే.. ఈ రైతు ఆదర్శం

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం తహశీల్దారుతోపాటు ధరణి కంప్యూటర్ ఆపరేటర్ అనిశాకు చిక్కారు. దీంతో రెవెన్యూ శాఖలో రోజురోజుకు పెచ్చుమీరుతున్న అవినీతి బాగోతం మరోమారు బహిర్గతమైంది. కసరబోయిన గోపాల్ అనే రైతు తన తండ్రి నుంచి తన పేరిట భూమిని విరాసత్ చేయాలని స్లాట్ బుక్ చేసుకున్నారు. అయినా తహసీల్దారు మాధవి కనుసన్నల్లో ధరణి ఆపరేటర్ రాకేశ్ రూ.5 వేల లంచం డిమాండు చేశారు.

జిల్లాలో చూసినా..

వరంగల్ జిల్లా రెవెన్యూలో అవినీతి తిమింగలాలు భారీగానే ఉన్నాయి. 2022లో ఓ మండలంలో తహసీల్దారు ఓ గిఫ్ట్ డీడ్ విషయంలో లంచం తీసుకుంటూ అనిశాకు పట్టుబడ్డారు. ఈ అధికారి గతంలో కలెక్టరేట్లో పనిచేసిన సమయంలో ధరణి విషయంలో రూ.కోట్లు వసూలు చేసినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. అప్పట్లో ఓ ఉన్నతాధికారిణికి కూడా భారీగానే వాటాలు ముట్టజెప్పినట్టు చెబుతున్నారు.

జనగామజిల్లా రఘునాథపల్లి తహసీల్దారు కార్యాలయంలో సైతం ఓ అధికారి భారీ ఎత్తున రైతుల నుంచి ముడుపులు తీసుకుంటున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కుర్చపల్లితోపాటు, పరిసర గ్రామాల్లో ధరణిలో వచ్చిన లోపాలను సరిదిద్దుతామంటూ రూ.లక్షల్లో దండుకున్నట్టు సమాచారం. జనగామ జిల్లాలో గతంలో పనిచేసి బదిలీవేటు పడిన ఓ ఉన్నతాధికారికి కూడా కొందరు తహసీల్దార్లు సెటిల్‌మెంట్ల పేరుతో దరఖాస్తుదారుల నుంచి భారీగా లంచాలు వసూలు చేసి వాటాలు ఇచ్చినట్టు అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పరిధి రెవెన్యూలో కొందరు ఆపరేటర్లదే ఇష్టారాజ్యంగా నడుస్తోంది. ప్రతి రిజిస్ట్రేషన్‌లో కొర్రీలు పెడుతూ ఒక్కొక్కరి నుంచి రూ.2 వేల నుంచి రూ.4 వేలు వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది.

మీరూ ఫిర్యాదు చేయొచ్చు

చట్ట ప్రకారం చేయాల్సిన పనులు చేయకుండా ప్రభుత్వ శాఖల్లో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే అనిశా టోల్‌ఫ్రీ నెంబరు 1064 లేదా అనిశా వరంగల్ రేంజ్ డీఎస్పీ 91543-88912 ఇన్‌స్పెక్టర్ 91543-88913 నెంబర్‌కు కాల్ చేయొచ్చు. లేదా నేరుగా అనిశా అధికారుల వద్దకు వచ్చి ఫిర్యాదు చేయొచ్చు.

తహసీల్దార్‌పై గతంలోనూ అవినీతి ఆరోపణలు కమలాపూర్ తహసీల్దార్ పాలకుర్తి మాధవి అవినీతి గురించి ఏసీబీ డీఎస్పీ సాంబయ్య పలు విషయాలు వెల్లడించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో తహసీల్దార్‌గా పనిచేసిన సమయంలో భూ సేకరణకు సంబంధించి అక్కడి రైతుల నుంచి డబ్బులు వసూలు చేసిందనే ఆరోపణలున్నాయని చెప్పారు. తమ విచారణలో ఈ తహసీల్దార్ (మాధవి) అవినీతి అధికారి (కరప్ట్ ఆఫీసర్)గా తేలిందని పేర్కొన్నారు.

## నిధులున్నా.. నీరుగారిన నిర్వహణ



భూపాలపల్లి : జిల్లాకు సాగునీరందే ఏకైక సాగునీటి కాలువ ఎస్సారెస్పీ డీబీఎం 38.. రేగొండ, చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి, గణపురం మండలాల మీదుగా ఉప కాల్వలు ఉన్నాయి. వీటి ద్వారా చెరువులు నింపి సాగునీరు అందిస్తారు. కానీ, ఆయా మండలాల పరిధిలోని ఎస్సారెస్పీ కాల్వలు అస్తవ్యస్తంగా మారాయి. గతేడాది కురిసిన వర్షాలకు కాల్వలు దెబ్బతినగా, ఇప్పటికీ మరమ్మతుకు నోచుకోలేదు. నిధులు వచ్చినా కొన్నిచోట్ల పనులు ప్రారంభం కాలేదు. డీబీఎం 38 కాలువ జిల్లాలో 30 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. పలుచోట్ల కాలువ లైనింగ్ ధ్వంసమైంది. వరదలకు గండ్లు పడ్డాయి. పిచ్చి మొక్కలు, తుప్పలు మొలచి కాల్వ పరిస్థితి అధ్వానంగా మారింది. కాల్వలు ఇలా ఉంటే.. వచ్చే వానాకాలం సీజన్‌లో పంటలకు నీరందుతుందా..? అని రైతులు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

నిధులున్నా : రేగొండ, చిట్యాల, టేకుమట్ల, గణపురం మండలాల్లో కాల్వల మరమ్మతుకు నీటిపారుదల శాఖకు రూ.69.86 లక్షలు నిధులు వచ్చాయి. గణపురం మండలానికి రూ.47.90 లక్షలు, చిట్యాల రూ.12.15 లక్షలు, రేగొండ రూ.7.83 లక్షలు, టేకుమట్ల రూ.1.98 లక్షలు మంజూరయ్యాయి. ఇందులో టేకుమట్ల మండలంలో పనులు పూర్తయ్యాయి. రేగొండలో ఒకచోట పూర్తికాగా మరో నాలుగు పనులు చేపట్టాల్సి ఉంది. మిగతా ప్రాంతాల్లో ఇప్పటికీ పనులు పూర్తికాలేదు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, వర్షాల కారణంగా పనులు ఆలస్యమయ్యాయని అధికారులు చెబుతున్నారు.

పనులు పూర్తిచేసేలా చర్యలు..

– వెంకటేశ్వర్లు, ఈఈ, భూపాలపల్లి

కాల్వల మరమ్మతుకు నిధులు మంజూరయ్యాయి. టేకుమట్ల మండలంలో పనులు పూర్తయ్యాయి. రేగొండ, చిట్యాల, గణపురం మండలాల్లో పనులు చేపడతాం. ఉపాధి హామీ పథకంలో కొన్నిచోట్ల కాల్వల్లో పిచ్చి మొక్కలు తొలగించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పనుల ప్రారంభానికి ఆటంకం కలిగింది. వర్షాకాలం సీజన్ కల్లా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.మరమ్మతు చేపట్టాలి– నర్రా వెంకటేశ్వర్లు, గుంటూరుపల్లి, చిట్యాల ఎస్సారెస్పీ నీరు ఈ సారి ఎక్కువగా వినియోగించుకునే అవకాశం ఉంది. కాల్వలు సరిగా లేవు. పిచ్చి మొక్కలు పెరిగాయి... కాల్వల పరిస్థితి బాగాలేదు. శుభ్రం చేసి నీరు అందించాలి. నీరు రాక సాగు మానుకున్నాం–పైడిపల్లి రాజయ్య, పెద్దంపల్లి, టేకుమట్ల ఎస్సారెస్పీ కాల్వల కింద మూడెకరాల భూమి ఉంది. యాసంగిలో మొక్కజొన్న సాగు చేద్దామనుకున్నా.. కాలువ ద్వారా నీరు రావడం లేదని మానుకున్నాం. కాల్వ కొట్టుకుపోవడం, తుప్పలు పెరగడంతో చివరి ఆయకట్టుకు నీరు రావడం లేదు. గండ్లు పడిన చోట మరమ్మతు చేసి, సాగునీరందేలా చూడాలి.

## అధ్వాన రోడ్లు.. తప్పని అవస్థలు

కోరుట్ల: కోరుట్ల పట్టణంలోని సిమెంట్‌రోడ్లు పూర్తిగా దెబ్బతిని అధ్వానంగా మారాయి. చాలా ఏళ్ల క్రితం నిర్మించిన సీసీరోడ్లు కావడం, మూడేళ్ల క్రితం మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్, ఇంటింటికి కుళాయిల ఏర్పాటు కోసం రోడ్లను తవ్వారు. పైపులైన్ నిర్మాణం తర్వాత సిమెంట్‌రోడ్లకు మరమ్మతు చేయకుండా వదిలేశారు. పట్టణంలోని 28, 29వ వార్డుల్లో అత్యంత రద్దీగల ఇందిరారోడ్, టిచర్స్‌క్లబ్‌రోడ్, ప్రసాద్ సెలక్షన్‌రోడ్‌లు పూర్తిగా చెడిపోయాయి. ఈరోడ్లలో బ్యాంక్‌లు, వస్త్ర వ్యాపారం, స్టీల్ దుకాణాలు, ఆసుపత్రులు, ఏజెన్సీలు, ఇలా అన్ని రకాల దుకాణ సముదాయాలున్నాయి. కూరగాయల మార్కెట్‌కు, పట్టణంలోని చాలా కాలనీలకు వెళ్లే ప్రధాన దారులు కావడంతో ఉదయం నుంచి రాత్రి వరకు వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. దెబ్బతిన్న రోడ్లపై వాహనాలు వెళ్లడం ప్రజలకు ఇబ్బందికరంగా మారాయి.చాలా ఏళ్ల కిందట నిర్మించిన కాలువలు దెబ్బతిని అందులో మురుగు నీరు ముందుకు సాగక వారాల తరబడి నిల్వ చేరి దుర్గంధం వ్యాపిస్తోంది. దారులకు అడ్డుగా ఉన్న మురుగు కాలువల మరమ్మతుల సమయంలో సమాంతరం పాటించకుండా ఇష్టం వచ్చినట్లు ఎత్తులో నిర్మించడంతో వాహనాల రాకపోకలకు ఇక్కట్లు తలెత్తుతున్నాయి. పట్టణంలో వ్యాపారానికి నిలమయమైన కాలనీలో నూతన సిమెంట్‌రోడ్లు నిర్మించాలని బల్దియా అధికారులకు, పాలకులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించునే వారే కరవయ్యారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అదుపు తప్పి ప్రమాదాలుసిమెంట్‌రోడ్లు దెబ్బతినడంతో ద్విచక్ర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నూతనంగా రోడ్ల నిర్మాణం చేపట్టాలని బల్దియా పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈరోడ్లపై వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. బెజ్జారపు హరికృష్ణ, మెకానిక్‌రద్దీ ఎక్కువగా ఉంటుంది..చాలా ఏళ్ల కిందట నిర్మించిన సిమెంట్‌రోడ్లు కావడంతో పూర్తిగా చెడిపోయాయి. నూతన సీసీరోడ్ల నిర్మాణం చేపట్టి వాహనాల, ప్రజల రాకపోకలకు ఇక్కట్లు లేకుండా చూడాలి.

# గుర్తింపు సరే.. నిధులు ఏవీ?

కరీంనగర్ : మానకొండూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రమిది. ఇది 2022 మే నెలలో ఎన్‌క్వాస్‌కు ఎంపికైంది. రెండేళ్లు కావస్తున్నా కేంద్రం ప్రకటించిన నిధులు ఇప్పటికీ విడుదల కాలేదు.

నాణ్యత ప్రమాణాలు మెరుగుపడాల్సి ఉంది.

జిల్లాలో నాణ్యత ప్రమాణాలు, వైద్య సేవలు బాగున్న ఆరోగ్య కేంద్రాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి ప్రోత్సాహకాలు అందజేస్తోంది. ఆ నిధులతో ఆసుపత్రుల పనితీరును మరింత మెరుగుపరుస్తారు. కానీ రావాల్సిన ప్రోత్సాహకాలు ఏటా విడుదల కాకపోతే ప్రమాణాలు ఎలా మెరుగు పడుతాయనేది గుర్తించడం లేదు. ఇదిలా ఉండగా.. మళ్లీ కొత్త ఆసుపత్రుల ఎంపికకు కసరత్తు చేయడం గమనార్హం. మరిన్ని వివరాలతో కథనం.

కేంద్ర బృందం పరిశీలించి..

ప్రభుత్వ ఆసుపత్రులలో నాణ్యత ప్రమాణాలతో వైద్య సేవలు అందించడం, అవసరమైన మందులు నిల్వలు, రికార్డుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం వంటి ఎనిమిది విభాగాలను పరిశీలించి నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్(ఎన్‌క్వాస్)కు ఎంపిక చేస్తారు. కేంద్ర బృందం వచ్చి ఈ అంశాలను పరిశీలన జరిపి, ఎంపిక చేస్తుంది. ఇలా ఎంపికైన వాటికి మూడేళ్లపాటు ఏటా నిధులు విడుదల చేస్తారు. కానీ రెండేళ్లుగా నిధులు రావడం లేదు. ఆయా ఆసుపత్రుల పరిధిలో వీటిని ఖర్చు చేస్తారు.రామడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రమిది. 2021లో జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఎన్‌క్వాస్‌కు ఎంపికైంది. దీనికి రావాల్సిన ప్రోత్సాహక నిధులు నేటికీ రాలేదు.

ప్రోత్సాహకాలు ఇలా..

ప్రతి ఆరోగ్య కేంద్రానికి ఏడాదికి రూ.3 లక్షల చొప్పున మూడేళ్లలో రూ.9 లక్షలు కేటాయిస్తారు.

పట్టణ ఆరోగ్య కేంద్రానికి ఏటా రూ.2 లక్షలు, మూడేళ్లకు రూ.6 లక్షలు ఇస్తారు.

పల్లె దవాఖానాలు, సబ్‌సెంటర్లకు ఏటా రూ.1.50 లక్షల చొప్పున రూ.4.50 లక్షలు మంజూరు చేస్తారు.

జిల్లాలో అర్హత సాధించిన ఆసుపత్రులు..

8 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు: రామడుగు(డిసెంబరు 2021), చల్లూరు(ఏప్రిల్ 2022), గంగాధర(ఏప్రిల్ 2022), శంకరపట్నం(జనవరి 2023), మానకొండూర్ (మే 2022), కొత్తపల్లి (డిసెంబరు 2022), గుండి (ఏప్రిల్ 2023), తిమ్మాపూర్(ఆగస్టు 2023).

7 సబ్‌సెంటర్లు, పల్లె దవాఖానాలు: ఎలబాక, దుర్శేడ్(సెప్టెంబరు 2023), కొండ పలకల, ములకనూర్ (నవంబర్ 2023), జమ్మికుంట–2(అక్టోబరు 2023), బూరుగుపల్లి(మార్చి 2024), అన్నారం (ఫిబ్రవరి 2024)కేంద్రాలు ఉన్నాయి.

పట్టణ ఆరోగ్య కేంద్రాలు: కరీంనగర్‌లోని మోతాజ్‌ఖాన(జూన్ 22), బుట్టిరాజరాంకాలనీ(ఫిబ్రవరి 23) ఆరోగ్య కేంద్రాలు ఎంపికయ్యాయి. వీటిలో గంగాధర, చల్లూరు, శంకరపట్నం, బుట్టిరాజరాంకాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రానికి మాత్రమే ప్రోత్సాహక నిధులు వచ్చాయి. మిగతా వాటికి రాలేదు.

ఎంపిక కోసం ముస్తాబు : వీణవంక, చిగురుమామిడి, చామన్‌పల్లి ఆరోగ్య కేంద్రాలు, ఎరడపల్లి, గన్నేరువరం, గర్షకుర్తి పల్లె దవాఖానాలు ఎన్‌క్వాస్ ఎంపికకు ముస్తాబవుతున్నాయి.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

జిల్లాలో ఎన్‌క్వాస్‌కు ఎంపికైన ఆసుపత్రులకు రావాల్సిన ప్రోత్సాహకాల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. కొన్నింటికి విడుదల చేశారు. మిగిలిన వాటికి నిధుల విడుదలయ్యే అవకాశముంది. వీటితో సంబంధం లేకుండా కొత్త ఆసుపత్రుల ఎంపిక కోసం చర్యలు చేపట్టాం. డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో, కరీంనగర్

## ఆగని ఇసుక దందా

పాపన్నపేట: ఇసుక అక్రమ రవాణాకు అధికారులు చర్యలు తీసుకుంటామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. వాగులు, నదులు, చెరువులను అక్రమార్కులు ఇష్టానుసారం తవ్వేస్తూ ‘జలసిరి’ని తరలించి జేబులు నింపుకొంటున్నారు. పాపన్నపేట మండల పరిధి ఆరేపల్లిలో ఇదే దందా కొనసాగుతోంది. గ్రామ శివారు మంజీరా నది నుంచి వారం రోజులుగా ఇసుక రవాణా కొనసాగుతోంది. ఇందుకోసం సుమారు 200 గాడిదలను వినియోగిస్తున్నారు. నదిలో కూలీలతో తవ్వకాలు జరిపి సంచుల్లో నింపి గాడిదలపై వేసి ఒడ్డుకు తీసుకువస్తున్నారు. అనంతరం సమీపంలో ఉన్న పొలాల్లో, ఇళ్ల సమీపంలో నిల్వ చేస్తున్నారు. అదును చూసుకుని రాత్రి సమయంలో లారీల్లో బయటకు తరలించి విక్రయిస్తున్నారు. బహిరంగంగానే ఈ వ్యవహారం సాగుతున్నా, ఎవరూ పట్టించుకోవడంలేదు.

అనుమానం రాకుండా..: ట్రాక్టర్లను వినియోగిస్తే వ్యాపారం చేస్తున్నారని అనుమానం వస్తుందని, మూగజీవాలతో తరలించేస్తున్నారు. వాహనాలు వెళ్లే పరిస్థితి కూడా ఉండకపోవడంతో ఈ మార్గాన్ని ఎంచుకున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే గ్రామంలో గృహ అవసరాల కోసం అంటూ బదులిస్తున్నారు. దీంతో అధికారులు సైతం వదిలేస్తున్నారు.



దీనినే ఆసరాగా చేసుకుని దందా చేస్తున్నారు. ఒక ట్రాక్టర్ లోడ్ ఇసుకను నది నుంచి బయటకు తీసుకువచ్చినందుకు గాడిద గుంపులకు రూ.2వేల వరకు యజమానులకు చెల్లిస్తున్నారు. ట్రాక్టర్ లోడ్ ఇసుకను బయటకు రూ.4వేల నుంచి రూ.7వేలకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాటు మండల పరిధి ఎన్కేపల్లి, గాజులగూడెం, చిత్రియాల, కొడుపాక, పొడ్చన్‌పల్లి, గాంధారిపల్లి, తదితర గ్రామాల మంజీరా తీరం నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆరేపల్లిలో ఇసుక తవ్వకాల విషయం మా దృష్టికి రాలేదని పాపన్నపేట తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు అన్నారు. వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

# సకాలంలో అందేనా!

కోరుట్ల: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ఇప్పటికే పలు పథకాలలో భాగస్వామ్యం చేయగా ప్రస్తుత ఏకరూప దుస్తుల తయారీ బాధ్యతలను అప్పగించారు. ఇటీవల ప్రభుత్వం మహిళలకు వడ్డీలేకుండా రూ.కోటి రుణాలు అందిస్తామని ప్రకటించడమే కాకుండా అన్ని శాఖల దుస్తుల తయారీ, ప్రభుత్వ పాఠశాలల ఏకరూప దుస్తుల తయారీ చేసేందుకు కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్, కస్తూర్బా, ఆదర్శ తదితర పాఠశాలలు దాదాపు 853 వరకు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో చదివే బాలబాలికలకు ప్రభుత్వం ఏకరూప దుస్తులను పంపిణీ చేస్తుంది. జిల్లా వ్యాప్తంగా 72 కేంద్రాలను మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేసి 1,61,763 ఏకరూప దుస్తుల తయారీకి అధికారులు ప్రణాళికలు తయారు చేశారు. జూన్ 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానుండగా వచ్చేనెల 11లోపు దుస్తుల తయారీ పూర్తి చేయాలని భావిస్తున్నప్పటికీ వస్త్రం ఆదివారం జిల్లాకు చేరుకోవడంతో మహిళా సంఘాలపై ఒత్తిడి పెరిగే అవకాశముందని వాపోతున్నారు.



విద్యాసంవత్సరం ప్రారంభానికి విద్యార్థులకు అందుతాయా? లేదా? అని ప్రశ్నార్థకంగా మారింది. కుట్టు కేంద్రాలలో అధికారులు పర్యవేక్షణ పెంచి తయారీని వేగవంతం చేయాల్సిన అవసరముంది.

జిల్లాలో 72 కేంద్రాల్లో..

జిల్లాలో 380 గ్రామాలతోపాటు జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్ పురపాలికలు ఉన్నాయి. వీటికి అనుగుణంగా డీఆర్డీవో, మెప్మా ఆధ్వర్యంలో 1417 మంది స్వశక్తి మహిళలతో 72 కుట్టు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలలో 840 కుట్టు యంత్రాలను అందుబాటులో ఉంచారు. ఇందులో పంచాయతీలలో 67 కేంద్రాలను ఏర్పాటు చేసి 988 మంది స్వశక్తి మహిళలను ఎంపిక చేసి 1,20,822 ఏకరూప దుస్తులు, మున్సిపల్ పరిధిలో అయిదు కేంద్రాలను ఏర్పాటు చేసి 429 మందితో 40,941 దుస్తులను తయారీ చేయనున్నారు. గత ఏప్రిల్‌లో సెలవులు రాక ముందే స్వయం సహాయక సంఘాల ద్వారా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఏజెన్సీ, స్థానిక దర్జీలకు దుస్తులు కుట్టే అవకాశం కల్పించగా ప్రస్తుతం పూర్తిగా స్వశక్తి సంఘం మహిళలకే కేటాయించారు. కుట్టిన వస్త్రానికి కేవలం రూ.50 చొప్పున మాత్రమే చెల్లించేందుకు నిర్ణయించడంతో గిట్టుబాటు అవ్వడం కష్టంగా ఉందని మహిళలు వాపోతున్నారు. ఇప్పటికే పాఠశాలల్లో స్వశక్తి సంఘాల్లోని మహిళలను అమ్మ ఆదర్శ కమిటీలలో సభ్యులుగా చేర్చడంతో ప్రభుత్వ పాఠశాలల్లో మహిళల భాగస్వామ్యం పెరనుందని భావిస్తున్నారు.

పాఠశాలల ప్రారంభానికి ముందే..

వస్త్రం అందించడంలో ఆలస్యం కావడంతో ముందుగా ఒక జత అందించేందుకు ప్రతి మండలంలో రెండు నుంచి నాలుగు కుట్టు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏటా ప్రభుత్వం ఏడాదికి రెండు జతల చొప్పున విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందిస్తున్నారు. ముందుగా ఒక జత అందించేందుకు మండలానికి ఒక ప్రత్యేకాధికారిని నియమించడమే కాకుండా ఎంఈవో, డీఆర్డీవో, ఏపీఎంలతోపాటు 64 మంది సీసీ క్లస్టర్ల పరిధిలో కుట్టు కేంద్రాలను పర్యవేక్షిస్తూ వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఏటా అందించే ఏకరూప దుస్తులలో నాణ్యత ఉండకపోవడమే కాకుండా చిన్నపిల్లలకు పెద్ద సైజులో, పెద్ద వారికి చిన్న సైజులో అందించడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతుండేవారు. ఈసారి అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారుల పర్యవేక్షణ పెంచి, ముందు నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని, పాఠశాలలు ప్రారంభానికి ముందే అందించేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఒక జత అందించేలా చర్యలు

జిల్లా వ్యాప్తంగా సెర్ప్ ద్వారా 67, మెప్మా ద్వారా అయిదు కేంద్రాలను ఏర్పాటు చేసి, స్వయం సహాయక సంఘాల ద్వారా ఏకరూప దుస్తుల తయారీకి చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం జిల్లాకు వస్త్రం చేరుకోవడంతో కుట్టు పనులు ప్రారంభించి, ముందుగా ఒక జత అందించేలా ప్రణాళిక తయారు చేశాం. మల్లేశం, డీపీఎం, జగిత్యాల

# పొదుపు పద్దులో అక్రమాలకు అడ్డుకట్ట

పెద్దపల్లి : స్వయం సహాయక సంఘాలకు రుణాల పంపిణీలో పారదర్శకత పాటించేందుకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) అవసరమైన చర్యలు తీసుకుంటోంది. మహిళా సాధికారతకు వినియోగించే ప్రతి పైసాకు లెక్క చూపేందుకు కార్యాచరణ చేపట్టింది. అతివల పొదుపు ప్రాతిపదికన బ్యాంకర్లు లింకేజీ రుణాలు మంజూరు చేస్తున్నారు. సభ్యులు వాటిని నెల వారీ కిస్తుల రూపంలో తిరిగి చెల్లిస్తున్నారు. లింకేజీతో పాటు స్త్రీనిధి, గ్రామైక్య, మండల సమాఖ్యల నుంచి కూడా మహిళలు రుణాలు పొందుతున్నారు. బ్యాంకు లింకేజీ రుణాల విషయంలో పెద్దగా సమస్య లేదు. గ్రామైక్య, స్త్రీనిధి రుణాలకు మాత్రం ప్రతి సంవత్సరం ఆడిట్ నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం నియమించిన ఆడిటర్లు దస్త్రాలతో కుస్తీ పడుతున్నారు. ఈ నెలాఖరులోగా శత శాతం ఆడిట్ చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

నెలాఖరులోగా పూర్తికి ఆదేశాలుగ్రామైక్య సంఘాల రుణాల పంపిణీపై ఆడిటర్లు నిశితంగా పరిశీలిస్తున్నారు. ప్రతి వీవోకు అధ్యక్షురాలు, కార్యదర్శి, కోశాధికారి ఉంటారు. క్షేత్ర స్థాయిలో వీవోఏ(విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్) ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో దస్త్రాలను నమోదు చేస్తున్నారు. కొన్ని చోట్ల వీవోఏలు, సంఘాల కార్యవర్గ సభ్యులతో కుమ్మక్కై సొమ్ము స్వాహా పర్వానికి పాల్పడుతున్నారు. దీంతో సంఘాల నగదు నిల్వ, జమ, ఖర్చులపై ఆడిటర్లు ఆరా తీస్తున్నారు. ఆన్‌లైన్‌లోనూ పరిశీలిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 61 మండల సమాఖ్య, 1,955 గ్రామైక్య సంఘాల పరిధిలో 49,448 స్వశక్తి సంఘాల లావాదేవీలు నిర్వహిస్తున్నారు. నెలాఖరులోపు ఆడిట్ నివేదికలు పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలున్నాయి. కాగా ఆడిట్ ప్రక్రియపై ఎండల తీవ్రత ప్రభావం చూపింది. దస్త్రాల తనిఖీల్లో వ్యత్యాసం ఉంటే ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు. అవకతవకలు తేలితే బాధ్యుల నుంచి సొమ్ము రికవరీ చేయాల్సి ఉంటుంది.

ప్రతి పైసాకూ లెక్కస్వశక్తి సంఘాల మహిళలు పొదుపులో ఆదర్శంగా నిలుస్తున్నారు. వారి ఆర్థిక అభ్యున్నతికి మండల, గ్రామైక్య సంఘాలు కూడా రుణాలు ఇస్తున్నాయి. పలు చోట్ల నిధులు పక్కదారి పడుతున్నాయనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

# వీళ్లు మారరు వసూళ్ల పర్వం ఆపరు!



వరంగల్ : ఉమ్మడి వరంగల్‌లోని అనేక మండలాల పరిధిలో రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది వసూళ్ల పర్వంలో మునిగితేలుతున్నారు. ప్రజలు వీరికి ఆమ్యామ్యాలు చెల్లించలేక చివరకు అవినీతి నిరోధక శాఖ (అనిశా)ను ఆశ్రయిస్తున్నారు. కొన్నేళ్ల అనిశా కేసులను పరిశీలిస్తే రెవెన్యూ శాఖవారే ఎక్కువగా పట్టుబడుతుండటం దీనికి నిదర్శనం.

రైతులను వేధిస్తూ

కమలాపూర్ తహసీల్దారు కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది గతంలోనూ అనేక మంది రైతుల వద్ద భారీగా లంచాలు వసూలు చేసినట్టు ఫిర్యాదులు ఉన్నాయి. కమలాపూర్ హనుమకొండ నగరానికి దగ్గరగా ఉండడంతో భూముల ధరలు ఎక్కువగా ఉంటాయి. దీంతో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన రైతుల నుంచి భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. స్థిరాస్తి వ్యాపారాన్ని ఆసరా చేసుకొని కూడా రూ.లక్షలు వసూలు చేస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. వ్యవసాయేతర భూమి (నాలా)గా మార్చాలని దరఖాస్తు చేసుకోగా రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు దండుకోవడం చర్చనీయాంశమవుతోంది.

ఇదే కార్యాలయంలో పనిచేసే మరికొందరు సిబ్బంది ఏడాది కిందట ఓ మేజర్ పంచాయతీలో రూ.లక్షల్లో డబ్బులు దండుకొని కుటుంబ సభ్యులకు కాకుండా వేరే వ్యక్తికి ఫ్యామిలీ మెంబర్ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఇటీవల ఈ పంచాయితీ పోలీసు స్టేషన్ వరకు వెళ్లడంతో ఓ రాజకీయ నాయకుడు మధ్యవర్తిగా బాధితురాలిని ఒప్పించి రూ.మూడు లక్షలకు సెటిల్ చేయడం గమనార్హం.

కేసుల్లో పెరుగుదల ఇటీవల అనిశా అధికారులు అవినీతిపరులపై దృష్టిసారిస్తుండడంతో బాధితులు ఫిర్యాదు ఇవ్వగానే వల పన్ని పట్టుకుంటున్నారు. ఈ క్రమంలో కేసుల సంఖ్యలో పెరుగుదల కనిపిస్తోంది. ఈ ఏడాది ఇప్పటికే ఏడు కేసులు నమోదయ్యాయి. కేసుల్లో రెవెన్యూ శాఖే అగ్రస్థానంలో నిలుస్తోంది. గత మూడేళ్లలో 27 కేసులు నమోదవ్వగా వీరిలో ఏడుగురు వారే ఉన్నారు.

రెవెన్యూ శాఖ ఒక్కటే కాదు.. పోలీసు, పురపాలక, రిజిస్ట్రేషన్లు, పంచాయతీ రాజ్ శాఖల్లోనూ అవినీతి పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తమవుతోంది. చాలా చోట్ల లంచం ఇస్తేనే పని జరిగే పరిస్థితి ఉంది. పై స్థాయి అధికారులు తమ కింది సిబ్బంది ద్వారా వసూళ్లకు పాల్పడుతున్నారని.. ఒకవేళ అనిశా దాడులు జరిగినా తెలివిగా తప్పించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అనిశా అధికారులు పోలీసు శాఖపైనా దృష్టి పెట్టాల్సి ఉంది.

ఏం జరిగిందంటే..ఈ రైతు ఆదర్శం

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం తహశీల్దారుతోపాటు ధరణి కంప్యూటర్ ఆపరేటర్ అనిశాకు చిక్కారు. దీంతో రెవెన్యూ శాఖలో రోజురోజుకు పెచ్చుమీరుతున్న అవినీతి బాగోతం మరోమారు బహిర్గతమైంది. కసరబోయిన గోపాల్ అనే రైతు తన తండ్రి నుంచి తన పేరిట భూమిని విరాసత్ చేయాలని స్లాట్ బుక్ చేసుకున్నారు. అయినా తహసీల్దారు మాధవి కనుసన్నల్లో ధరణి ఆపరేటర్ రాకేశ్ రూ.5 వేల లంచం డిమాండు చేశారు.

జిల్లాలో చూసినా..

వరంగల్ జిల్లా రెవెన్యూలో అవినీతి తిమింగలాలు భారీగానే ఉన్నాయి. 2022లో ఓ మండలంలో తహసీల్దారు ఓ గిఫ్ట్ డీడ్ విషయంలో లంచం తీసుకుంటూ అనిశాకు పట్టుబడ్డారు. ఈ అధికారి గతంలో కలెక్టరేట్లో పనిచేసిన సమయంలో ధరణి విషయంలో రూ.కోట్లు వసూలు చేసినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. అప్పట్లో ఓ ఉన్నతాధికారిణికి కూడా భారీగానే వాటాలు ముట్టజెప్పినట్టు చెబుతున్నారు.

జనగామజిల్లా రఘునాథపల్లి తహసీల్దారు కార్యాలయంలో సైతం ఓ అధికారి భారీ ఎత్తున రైతుల నుంచి ముడుపులు తీసుకుంటున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కుర్చపల్లితోపాటు, పరిసర గ్రామాల్లో ధరణిలో వచ్చిన లోపాలను సరిదిద్దుతామంటూ రూ.లక్షల్లో దండుకున్నట్టు సమాచారం. జనగామ జిల్లాలో గతంలో పనిచేసి బదిలీవేటు పడిన ఓ ఉన్నతాధికారికి కూడా కొందరు తహసీల్దార్లు సెటిల్‌మెంట్ల పేరుతో దరఖాస్తుదారుల నుంచి భారీగా లంచాలు వసూలు చేసి వాటాలు ఇచ్చినట్టు అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పరిధి రెవెన్యూలో కొందరు ఆపరేటర్లదే ఇష్టారాజ్యంగా నడుస్తోంది. ప్రతి రిజిస్ట్రేషన్‌లో కొర్రీలు పెడుతూ ఒక్కొక్కరి నుంచి రూ.2 వేల నుంచి రూ.4 వేలు వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది.

మీరూ ఫిర్యాదు చేయొచ్చు

చట్ట ప్రకారం చేయాల్సిన పనులు చేయకుండా ప్రభుత్వ శాఖల్లో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే అనిశా టోల్‌ఫ్రీ నెంబరు 1064 లేదా అనిశా వరంగల్ రేంజ్ డీఎస్పీ 91543-88912 ఇన్‌స్పెక్టర్ 91543-88913 నెంబర్‌కు కాల్ చేయొచ్చు. లేదా నేరుగా అనిశా అధికారుల వద్దకు వచ్చి ఫిర్యాదు చేయొచ్చు.

తహసీల్దార్‌పై గతంలోనూ అవినీతి ఆరోపణలు కమలాపూర్ తహసీల్దార్ పాలకుర్తి మాధవి అవినీతి గురించి ఏసీబీ డీఎస్పీ సాంబయ్య పలు విషయాలు వెల్లడించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో తహసీల్దార్‌గా పనిచేసిన సమయంలో భూ సేకరణకు సంబంధించి అక్కడి రైతుల నుంచి డబ్బులు వసూలు చేసిందనే ఆరోపణలున్నాయని చెప్పారు. తమ విచారణలో ఈ తహసీల్దార్ (మాధవి) అవినీతి అధికారి (కరప్ట్ ఆఫీసర్)గా తేలిందని పేర్కొన్నారు.

# నిధులున్నా.. నీరుగారిన నిర్వహణ



భూపాలపల్లి : జిల్లాకు సాగునీరందే ఏకైక సాగునీటి కాలువ ఎస్సారెస్పీ డీబీఎం 38.. రేగొండ, చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి, గణపురం మండలాల మీదుగా ఉప కాల్వలు ఉన్నాయి. వీటి ద్వారా చెరువులు నింపి సాగునీరు అందిస్తారు. కానీ, ఆయా మండలాల పరిధిలోని ఎస్సారెస్పీ కాల్వలు అస్తవ్యస్తంగా మారాయి. గతేడాది కురిసిన వర్షాలకు కాల్వలు దెబ్బతినగా, ఇప్పటికీ మరమ్మతుకు నోచుకోలేదు. నిధులు వచ్చినా కొన్నిచోట్ల పనులు ప్రారంభం కాలేదు. డీబీఎం 38 కాలువ జిల్లాలో 30 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. పలుచోట్ల కాలువ లైనింగ్ ధ్వంసమైంది. వరదలకు గండ్లు పడ్డాయి. పిచ్చి మొక్కలు, తుప్పలు మొలచి కాల్వ పరిస్థితి అధ్వానంగా మారింది. కాల్వలు ఇలా ఉంటే.. వచ్చే వానాకాలం సీజన్‌లో పంటలకు నీరందుతుందా..? అని రైతులు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

నిధులున్నా : రేగొండ, చిట్యాల, టేకుమట్ల, గణపురం మండలాల్లో కాల్వల మరమ్మతుకు నీటిపారుదల శాఖకు రూ.69.86 లక్షలు నిధులు వచ్చాయి. గణపురం మండలానికి రూ.47.90 లక్షలు, చిట్యాల రూ.12.15 లక్షలు, రేగొండ రూ.7.83 లక్షలు, టేకుమట్ల రూ.1.98 లక్షలు మంజూరయ్యాయి. ఇందులో టేకుమట్ల మండలంలో పనులు పూర్తయ్యాయి. రేగొండలో ఒకచోట పూర్తికాగా మరో నాలుగు పనులు చేపట్టాల్సి ఉంది. మిగతా ప్రాంతాల్లో ఇప్పటికీ పనులు పూర్తికాలేదు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, వర్షాల కారణంగా పనులు ఆలస్యమయ్యాయని అధికారులు చెబుతున్నారు.

పనులు పూర్తిచేసేలా చర్యలు..

– వెంకటేశ్వర్లు, ఈఈ, భూపాలపల్లి

కాల్వల మరమ్మతుకు నిధులు మంజూరయ్యాయి. టేకుమట్ల మండలంలో పనులు పూర్తయ్యాయి. రేగొండ, చిట్యాల, గణపురం మండలాల్లో పనులు చేపడతాం. ఉపాధి హామీ పథకంలో కొన్నిచోట్ల కాల్వల్లో పిచ్చి మొక్కలు తొలగించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పనుల ప్రారంభానికి ఆటంకం కలిగింది. వర్షాకాలం సీజన్ కల్లా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.మరమ్మతు చేపట్టాలి– నర్రా వెంకటేశ్వర్లు, గుంటూరుపల్లి, చిట్యాల ఎస్సారెస్పీ నీరు ఈ సారి ఎక్కువగా వినియోగించుకునే అవకాశం ఉంది. కాల్వలు సరిగా లేవు. పిచ్చి మొక్కలు పెరిగాయి... కాల్వల పరిస్థితి బాగాలేదు. శుభ్రం చేసి నీరు అందించాలి. నీరు రాక సాగు మానుకున్నాం–పైడిపల్లి రాజయ్య, పెద్దంపల్లి, టేకుమట్ల ఎస్సారెస్పీ కాల్వల కింద మూడెకరాల భూమి ఉంది. యాసంగిలో మొక్కజొన్న సాగు చేద్దామనుకున్నా.. కాలువ ద్వారా నీరు రావడం లేదని మానుకున్నాం. కాల్వ కొట్టుకుపోవడం, తుప్పలు పెరగడంతో చివరి ఆయకట్టుకు నీరు రావడం లేదు. గండ్లు పడిన చోట మరమ్మతు చేసి, సాగునీరందేలా చూడాలి.

# అధ్వాన రోడ్లు.. తప్పని అవస్థలు

కోరుట్ల: కోరుట్ల పట్టణంలోని సిమెంట్‌రోడ్లు పూర్తిగా దెబ్బతిని అధ్వానంగా మారాయి. చాలా ఏళ్ల క్రితం నిర్మించిన సీసీరోడ్లు కావడం, మూడేళ్ల క్రితం మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్, ఇంటింటికి కుళాయిల ఏర్పాటు కోసం రోడ్లను తవ్వారు. పైపులైన్ నిర్మాణం తర్వాత సిమెంట్‌రోడ్లకు మరమ్మతు చేయకుండా వదిలేశారు. పట్టణంలోని 28, 29వ వార్డుల్లో అత్యంత రద్దీగల ఇందిరారోడ్, టిచర్స్‌క్లబ్‌రోడ్, ప్రసాద్ సెలక్షన్‌రోడ్‌లు పూర్తిగా చెడిపోయాయి. ఈరోడ్లలో బ్యాంక్‌లు, వస్త్ర వ్యాపారం, స్టీల్ దుకాణాలు, ఆసుపత్రులు, ఏజెన్సీలు, ఇలా అన్ని రకాల దుకాణ సముదాయాలున్నాయి. కూరగాయల మార్కెట్‌కు, పట్టణంలోని చాలా కాలనీలకు వెళ్లే ప్రధాన దారులు కావడంతో ఉదయం నుంచి రాత్రి వరకు వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. దెబ్బతిన్న రోడ్లపై వాహనాలు వెళ్లడం ప్రజలకు ఇబ్బందికరంగా మారాయి.చాలా ఏళ్ల కిందట నిర్మించిన కాలువలు దెబ్బతిని అందులో మురుగు నీరు ముందుకు సాగక వారాల తరబడి నిల్వ చేరి దుర్గంధం వ్యాపిస్తోంది. దారులకు అడ్డుగా ఉన్న మురుగు కాలువల మరమ్మతుల సమయంలో సమాంతరం పాటించకుండా ఇష్టం వచ్చినట్లు ఎత్తులో నిర్మించడంతో వాహనాల రాకపోకలకు ఇక్కట్లు తలెత్తుతున్నాయి. పట్టణంలో వ్యాపారానికి నిలమయమైన కాలనీలో నూతన సిమెంట్‌రోడ్లు నిర్మించాలని బల్దియా అధికారులకు, పాలకులకు ఎన్నిసార్లు మెరపెట్టుకున్నా పట్టించునే వారే కరవయ్యారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అదుపు తప్పి ప్రమాదాలుసిమెంట్‌రోడ్లు దెబ్బతినడంతో ద్విచక్ర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నూతనంగా రోడ్ల నిర్మాణం చేపట్టాలని బల్దియా పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈరోడ్లపై వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. బెజ్జారపు హరికృష్ణ, మెకానిక్‌రద్దీ ఎక్కువగా ఉంటుంది..చాలా ఏళ్ల కిందట నిర్మించిన సిమెంట్‌రోడ్లు కావడంతో పూర్తిగా చెడిపోయాయి. నూతన సీసీరోడ్ల నిర్మాణం చేపట్టి వాహనాల, ప్రజల రాకపోకలకు ఇక్కట్లు లేకుండా చూడాలి.

# గుర్తింపు సరే.. నిధులు ఏవీ?

కరీంనగర్ : మానకొండూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రమిది. ఇది 2022 మే నెలలో ఎన్‌క్వాస్‌కు ఎంపికైంది. రెండేళ్లు కావస్తున్నా కేంద్రం ప్రకటించిన నిధులు ఇప్పటికీ విడుదల కాలేదు. నాణ్యత ప్రమాణాలు మెరుగుపడాల్సి ఉంది.

జిల్లాలో నాణ్యత ప్రమాణాలు, వైద్య సేవలు బాగున్న ఆరోగ్య కేంద్రాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి ప్రోత్సాహకాలు అందజేస్తోంది. ఆ నిధులతో ఆసుపత్రుల పనితీరును మరింత మెరుగుపరుస్తారు. కానీ రావాల్సిన ప్రోత్సాహకాలు ఏటా విడుదల కాకపోతే ప్రమాణాలు ఎలా మెరుగు పడుతాయనేది గుర్తించడం లేదు. ఇదిలా ఉండగా.. మళ్లీ కొత్త ఆసుపత్రుల ఎంపికకు కసరత్తు చేయడం గమనార్హం. మరిన్ని వివరాలతో కథనం.

కేంద్ర బృందం పరిశీలించి..

ప్రభుత్వ ఆసుపత్రులలో నాణ్యత ప్రమాణాలతో వైద్య సేవలు అందించడం, అవసరమైన మందులు నిల్వలు, రికార్డుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం వంటి ఎనిమిది విభాగాలను పరిశీలించి నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్(ఎన్‌క్వాస్)కు ఎంపిక చేస్తారు. కేంద్ర బృందం వచ్చి ఈ అంశాలను పరిశీలన జరిపి, ఎంపిక చేస్తుంది. ఇలా ఎంపికైన వాటికి మూడేళ్లపాటు ఏటా నిధులు విడుదల చేస్తారు. కానీ రెండేళ్లుగా నిధులు రావడం లేదు. ఆయా ఆసుపత్రుల పరిధిలో వీటిని ఖర్చు చేస్తారు.రామడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రమిది. 2021లో జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఎన్‌క్వాస్‌కు ఎంపికైంది. దీనికి రావాల్సిన ప్రోత్సాహక నిధులు నేటికీ రాలేదు.

ప్రోత్సాహకాలు ఇలా..

ప్రతి ఆరోగ్య కేంద్రానికి ఏడాదికి రూ.3 లక్షల చొప్పున మూడేళ్లలో రూ.9 లక్షలు కేటాయిస్తారు.

పట్టణ ఆరోగ్య కేంద్రానికి ఏటా రూ.2 లక్షలు, మూడేళ్లకు రూ.6 లక్షలు ఇస్తారు.

పల్లె దవాఖానాలు, సబ్‌సెంటర్లకు ఏటా రూ.1.50 లక్షల చొప్పున రూ.4.50 లక్షలు మంజూరు చేస్తారు.

జిల్లాలో అర్హత సాధించిన ఆసుపత్రులు..

8 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు: రామడుగు(డిసెంబరు 2021), చల్లూరు(ఏప్రిల్ 2022), గంగాధర(ఏప్రిల్ 2022), శంకరపట్నం(జనవరి 2023), మానకొండూర్ (మే 2022), కొత్తపల్లి (డిసెంబరు 2022), గుండి (ఏప్రిల్ 2023), తిమ్మాపూర్(ఆగస్టు 2023).

7 సబ్‌సెంటర్లు, పల్లె దవాఖానాలు: ఎలబాక, దుర్శేడ్(సెప్టెంబరు 2023), కొండ పలకల, ములకనూర్ (నవంబర్ 2023), జమ్మికుంట–2(అక్టోబరు 2023), బూరుగుపల్లి(మార్చి 2024), అన్నారం (ఫిబ్రవరి 2024)కేంద్రాలు ఉన్నాయి.

పట్టణ ఆరోగ్య కేంద్రాలు: కరీంనగర్‌లోని మోతాజ్‌ఖాన(జూన్ 22), బుట్టిరాజరాంకాలనీ(ఫిబ్రవరి 23) ఆరోగ్య కేంద్రాలు ఎంపికయ్యాయి. వీటిలో గంగాధర, చల్లూరు, శంకరపట్నం, బుట్టిరాజరాంకాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రానికి మాత్రమే ప్రోత్సాహక నిధులు వచ్చాయి. మిగతా వాటికి రాలేదు.

ఎంపిక కోసం ముస్తాబు : వీణవంక, చిగురుమామిడి, చామన్‌పల్లి ఆరోగ్య కేంద్రాలు, ఎరడపల్లి, గన్నేరువరం, గర్షకుర్తి పల్లె దవాఖానాలు ఎన్‌క్వాస్ ఎంపికకు ముస్తాబవుతున్నాయి.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

జిల్లాలో ఎన్‌క్వాస్‌కు ఎంపికైన ఆసుపత్రులకు రావాల్సిన ప్రోత్సాహకాల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. కొన్నింటికి విడుదల చేశారు. మిగిలిన వాటికి నిధుల విడుదలయ్యే అవకాశముంది. వీటితో సంబంధం లేకుండా కొత్త ఆసుపత్రుల ఎంపిక కోసం చర్యలు చేపట్టాం. డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో, కరీంనగర్

# ఆగని ఇసుక దందా

పాపన్నపేట: ఇసుక అక్రమ రవాణాకు అధికారులు చర్యలు తీసుకుంటామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. వాగులు, నదులు, చెరువులను అక్రమార్కులు ఇష్టానుసారం తవ్వేస్తూ 'జలసిరి'ని తరలించి జేబులు నింపుకొంటున్నారు. పాపన్నపేట మండల పరిధి ఆరేపల్లిలో ఇదే దందా కొనసాగుతోంది. గ్రామ శివారు మంజీరా నది నుంచి వారం రోజులుగా ఇసుక రవాణా కొనసాగుతోంది. ఇందుకోసం సుమారు 200 గాడిదలను వినియోగిస్తున్నారు. నదిలో కూలీలతో తవ్వకాలు జరిపి సంచుల్లో నింపి గాడిదలపై వేసి ఒడ్డుకు తీసుకువస్తున్నారు. అనంతరం సమీపంలో ఉన్న పొలాల్లో, ఇళ్ల సమీపంలో నిల్వ చేస్తున్నారు. అదును చూసుకుని రాత్రి సమయంలో లారీల్లో బయటకు తరలించి విక్రయిస్తున్నారు. బహిరంగంగానే ఈ వ్యవహారం సాగుతున్నా, ఎవరూ పట్టించుకోవడంలేదు.

అనుమానం రాకుండా..: ట్రాక్టర్లను వినియోగిస్తే వ్యాపారం చేస్తునారని అనుమానం వస్తుందని, మూగజీవాలతో తరలించేస్తున్నారు. వాహనాలు వెళ్లే పరిస్థితి కూడా ఉండకపోవడంతో ఈ మార్గాన్ని ఎంచుకున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే గ్రామంలో గృహ అవసరాల కోసం అంటూ బదులిస్తున్నారు. దీంతో అధికారులు సైతం వదిలేస్తున్నారు.



దీనినే ఆసరాగా చేసుకుని దందా చేస్తున్నారు. ఒక ట్రాక్టర్ లోడ్ ఇసుకను నది నుంచి బయటకు తీసుకువచ్చినందుకు గాడిద గుంపులకు రూ.2వేల వరకు యజమానులకు చెల్లిస్తున్నారు. ట్రాక్టర్ లోడ్ ఇసుకను బయటకు రూ.4వేల నుంచి రూ.7వేలకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాటు మండల పరిధి ఎన్కేపల్లి, గాజులగూడెం, చిత్రియాల, కొడుపాక, పొద్దన్‌పల్లి, గాంధారిపల్లి, తదితర గ్రామాల మంజీరా తీరం నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆరేపల్లిలో ఇసుక తవ్వకాల విషయం మా దృష్టికి రాలేదని పాపన్నపేట తహసీల్దార్ లక్ష్మణబాబు అన్నారు. వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.




గుంటూరు: మాజీ సీఎం జగన్, ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ సహా పలువురిపై కేసు నమోదైంది. తెదేపా ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఫిర్యాదు మేరకు గుంటూరులోని నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

వైకాపా ప్రభుత్వ హయాంలో రాజద్రోహం చట్టం కింద తనను అరెస్టు చేసి వేధించారని రఘురామ పేర్కొన్నారు. మాజీ సీఎం జగన్‌తో పాటు అప్పటి సీఐడీ డీజీ పీవీ సునీల్‌కుమార్, మరికొందరు అధికారులపై ఫిర్యాదు చేశారు. కస్టడీకి తీసుకున్న సమయంలో తనపై దాడి చేశారని ఆరోపించారు. 2021 మే 14న హత్యాయత్నం చేశారని.. రబ్బర్ బెల్ట్, లాఠీలతో కొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తప్పుడు నివేదికలు ఇచ్చారన్నారు. ఈ నేపథ్యంలో సునీల్‌కుమార్ (ఏ1), ఇంటెలిజెన్స్ మాజీ డీజీ పీఎస్ఆర్ ఆంజనేయులు (ఏ2), జగన్ (ఏ3), అప్పటి సీఐడీ ఏఎస్పీ విజయ్‌పాల్ (ఏ4), గుంటూరు జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి (ఏ5)పై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

హత్యాయత్నం, తప్పుడు నివేదికలు, భయభ్రాంతులకు గురిచేయడం తదితర అంశాలకు సంబంధించిన పలు సెక్షన్లు పెట్టారు. వీటిలో బెయిల్‌బుల్, నాన్‌బెయిల్‌బుల్ సెక్షన్లు కూడా ఉన్నాయి.




## భూపత్రాలు నాపేరిట ఉన్నాయి: రైతులను తుపాకీతో బెదిరించిన ట్రెయినీ ఐఏఎస్ తల్లి

అడ్డగోలుగా అధికార దుర్వినియోగంతో ప్రభుత్వ ఆగ్రహానికి గురైన ట్రెయినీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ ఇప్పుడు మరిన్ని చిక్కుల్లో పడ్డారు. ఆమె తల్లి ఓ వ్యక్తిని తుపాకీతో బెదిరించిన వీడియో బయటకు వచ్చింది. అందులో కొందరు గ్రామస్థులను ఆమె పిస్తోల్‌తో బెదిరిస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. తొలుత ఆమె తుపాకీ పట్టుకొని గ్రామస్థుల వద్దకు దూసుకువచ్చింది. అనంతరం ఆమె కెమెరాను చూడగానే.. "భూ పత్రాలను చూపించండి. నా పేరిట డాక్యుమెంట్స్ ఉన్నాయి" అంటూ మరాఠీ భాషలో ఓ వ్యక్తిని బెదిరించారు. దీనిపై ఆ వ్యక్తి స్పందిస్తూ.. భూపత్రాలు, కేసూ కోర్టులో ఉన్నాయని జవాబిచ్చాడు. అయితే కోర్టు ఆర్డర్ చూపాలని.. తనకు నిబంధనలపై పాఠాలు నేర్పొద్దని ఆమె హెచ్చరించారు. పూజ తండ్రి దిలీప్ విశ్రాంత ఐఏఎస్ ఆఫీసర్. ఆయన భారీగా ఆస్తులు కూడబెట్టారు. పుణే జిల్లాలో ముల్షి తాలూకాలో 25 ఎకరాలు సంపాదించారు. అదే సమయంలో పొరుగున ఉన్న రైతుల భూములను ఆక్రమించాలని యత్నించినట్లు ఆయన కుటుంబంపై ఆరోపణలు ఉన్నాయి. వారి దౌర్జన్యాలను రైతులు ప్రతిఘటించడంతో దిలీప్ భార్య మనోరమా మందీమార్బలం, తుపాకీతో అక్కడికి చేరుకొని రైతులను బెదిరించారు. ఈ విషయంపై రైతులు పుణెలోని పౌడ్ పోలీస్‌స్టేషన్‌లో దిలీప్ కుటుంబంపై ఫిర్యాదు చేశారు. మీడియాలో ఇటీవల వచ్చిన కథనాల ప్రకారం ట్రెయినీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ పేరిట ఐదు ప్లాట్లు, రెండు అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. వీటి విలువ రూ.22 కోట్లు. ఆమె ఉద్యోగం పొందే సమయంలో సంపన్న ఆర్థిక స్థితిని కూడా దాచిపెట్టారన్న ఆరోపణలు న్నాయి. ఆమె అభ్యర్థిత్వంపై విచారణ జరిపేందుకు కేంద్రం ఓ కమిటీని ఏర్పాటుచేసింది. ఒక సభ్యుడితో ఏర్పాటుచేసిన ఈ కమిటీ రెండు వారాల్లో నివేదిక ఇవ్వనుంది. తనకు నేత్ర, మానసిక సంబంధమైన కొన్ని సమస్యలున్నట్లు యూపీఎస్సీకి సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈనేపథ్యంలో కమిటీ నిజనిర్ధారణ చేయనుంది. పుణెలో బ్యూరోక్రాట్‌గా తన పదవిని దుర్వినియోగం చేయడం, ఇతర డిమాండ్లతో ఖేద్కర్ వివాదాస్పదమయ్యారు.

ఆమె తన ప్రైవేటు ఆడీ కారుకు సైరన్, మహారాష్ట్ర ప్రభుత్వ స్టిక్కర్, వీఐపీ నంబర్ ప్లేట్లను అనుమతి లేకుండా వాడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఆమె వినియోగించే ఖరీదైన ఆడీ కారుపై ఉన్న 21 చలాన్లు కట్టకుండా పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించారు. వీటి విలువ రూ.26,000.




ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి ప్రజల పట్ల సహృదయత చాటుకున్నారు. ఉండవల్లి నివాసం నుంచి సచివాలయానికి వెళ్తుండగా సమస్యలు చెప్పుకోవడానికి వచ్చిన ప్రజలను చూసి రోడ్డుపై కాన్వాయ్ ఆపారు. నక్సల్స్ చేతిలో హతమైన అరకు మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ కుటుంబసభ్యులు సీఎం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా సోమ భార్య ఇచ్చావతి యోగక్షేమాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. సోమ కుమారుడి చదువు బాధ్యతను తాను తీసుకుంటానని చంద్రబాబు హామీ ఇచ్చారు. మరికొందరు వ్యక్తులు సమస్యలపై వినతి పత్రాలు ఇవ్వగా పరిష్కరిస్తామని సీఎం భరోసా ఇచ్చారు.




## నా రాజకీయ గురువు ఏపీ సీఎం చంద్రబాబు: ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్


చంద్రబాబుతో ప్రకాశ్ గౌడ్ (పాతచిత్రం)

తిరుమల: కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నానని తెలంగాణలోని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. "స్వామి దర్శనం తర్వాత కీలక నిర్ణయం తీసుకున్నా. కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నాను. నా రాజకీయ గురువు ఏపీ సీఎం చంద్రబాబు. ఆయన మరోసారి ముఖ్యమంత్రి కావడం ఆనందంగా ఉంది. తెలుగు రాష్ట్రాల అభివృద్ధి గురించి చంద్రబాబు నిత్యం పరితపిస్తారు"అని ప్రకాశ్‌గౌడ్ అన్నారు. గత ఏడాది జరిగిన తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో భారాస తరఫున ప్రకాశ్‌గౌడ్ విజయం సాధించారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ప్రకాశ్‌గౌడ్‌కు రాజేంద్రనగర్ నియోజకవర్గంపై గట్టి పట్టు ఉంది. కాంగ్రెస్‌లో చేరి అభివృద్ధిని కొనసాగించాలని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## జూన్ 25.. రాజ్యాంగ హత్యా దినం: కేంద్రం ప్రకటన

దిల్లీ: కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దాదాపు 50ఏళ్ల క్రితం దేశంలో అత్యయిక స్థితిని విధించిన జూన్ 25వ తేదీని 'రాజ్యాంగ హత్యా దినం'గా ప్రకటించింది. ఈ మేరకు కేంద్రం శుక్రవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ విషయాన్ని హోం మంత్రి అమిత్ షా 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.

"1975 జూన్ 25న అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ తన నియంతృత్వ పాలనతో దేశంలో అత్యయిక స్థితి విధించి ప్రజాస్వామ్యం గొంతు నులిమేశారు. ఎలాంటి కారణం లేకుండా లక్షలాది మందిని జైల్లో పెట్టారు. మీడియా గళాన్ని అణగదొక్కారు. ఆ చీకటి రోజులకు నిరసనగా ఇక నుంచి ఏటా జూన్ 25ను 'సంవిధాన్ హత్య దివస్'గా నిర్వహించాలని నిర్ణయించాం. ఎమర్జెన్సీ సమయంలో ప్రజలు అనుభవించిన వేదనను, దాన్ని ఎదిరించి నిలబడిన యోధులను ఆ రోజున గుర్తుచేసుకుందాం" అని అమిత్ షా రాసుకొచ్చారు.

**ఆ చీకటి రోజులను గుర్తుచేస్తుంది: మోదీ –** ఈ ప్రకటనపై ప్రధాని మోదీ స్పందించారు. "నాటి ప్రభుత్వం రాజ్యాంగాన్ని అణగదొక్కి ఎలాంటి పాలన సాగించిందో ఈ సంవిధాన్ హత్య దివస్ మనకు గుర్తుచేస్తుంది. దేశ చరిత్రలో కాంగ్రెస్ రాసిన చీకటి దశ కారణంగా నష్టపోయిన ప్రతి ఒక్కరినీ స్మరించుకునే రోజు అది" అని ప్రధాని పేర్కొన్నారు. రాష్ట్రపతి దేశవ్యాప్త ఎమర్జెన్సీ ని విధిస్తున్నట్లు 1975 జూన్ 25వ తేదీ అర్ధరాత్రి ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ ఆకాశవాణి ద్వారా ప్రకటించారు. రాయ్‌బరేలీ నుంచి లోక్‌సభకు ఆమె ఎన్నిక చెల్లదని అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై షరతులతో కూడిన స్టే ఉత్తర్వును సుప్రీంకోర్టు వెలువరించిన కాసేపటికే ఇందిర ఈ సంచలనాత్మక నిర్ణయం తీసుకున్నారు. పార్లమెంటరీ కార్యకలాపాలకు దూరంగా ఆమె ఉండాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ క్రమంలోనే ఆమె ఎమర్జెన్సీ నిర్ణయం తీసుకున్నారు. అది సంచలనాత్మకం కావడం తోపాటు రాజకీయంగా ఇప్పటికీ తీవ్ర విమర్శలకు తావిస్తున్న విషయం తెలిసిందే. ఆమెను తొలగించేందుకు దేశవ్యాప్త ఉద్యమానికి జయప్రకాశ్ నారాయణ్ (జేపీ) పిలుపునిచ్చారు. విపక్ష నేతలైన జేపీ, అద్వాణీ, వాజ్‌పేయీ, మొరార్జీ దేశాయ్ సహా అనేకమందిని ఎమర్జెన్సీ సమయంలో ఖైదు చేశారు. పత్రికాస్వేచ్ఛపై కోత సహా అనేక రకాలుగా ఆంక్షలకు కారణమైన ఎమర్జెన్సీని ముగిస్తూ.. ఎన్నికలు నిర్వహించబోతున్నట్లు 1977 జనవరి 18న ఇందిర ప్రకటించారు. ఆ ఏడాది మార్చి 16 నుంచి 20 వరకు ఎన్నికలు నిర్వహించి, 21న అత్యయిక పరిస్థితిని ఎత్తివేశారు.




## తిరుమల జపాలి తీర్థంలో భక్తురాలిపై విరిగిపడ్డ చెట్టు కొమ్మ..

తిరుమల కొండ పైనున్న జపాలి తీర్థంలో విషాద ఘటన జరిగింది. బెంగళూరుకు చెందిన భక్తురాలు ఉమారాణి ఆంజనేయ స్వామి దర్శ నానికి వెళుతున్న సమయంలో ఆమె తలపై చెట్టు నుంచి కొమ్మ విరి గిపడింది. ఒక్కసారిగా కొమ్మ పడటంతో ఆమె అక్కడికక్కడే కుప్పకూ లిపోయారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఉమారాణిని తిరుమ లలోని అశ్విని ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం తిరుపతి బర్డ్ ఆస్పత్రికి తరలించారు.




నేపాల్‌లో శుక్రవారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం చోటుచేసుకొంది. నారాయణఘాట్-ముగ్‌లింగ్ జాతీయ రహదారిపై తెల్లవారుజామున 3.30 సమయంలో కొండ చరియలు విరిగి పడ్డాయి. ఆ సమయంలో భారీగా వర్షం కూడా కురుస్తోంది. దీంతో అదే మార్గంలో దాదాపు 65 మందికి పైగా ప్రయాణికులతో వెళ్తున్న రెండు బస్సులపై కొండచరియలు పడడంతో ఆ రెండు బస్సులు పక్కనే ఉన్న త్రిశూన్ నదిలో పడ్డాయి. గల్లంతైన వారిలో ఏడుగురు భారతీయులు కూడా ఉన్నట్లు సమాచారం. వీరు ప్రాణాలు కోల్పోయినట్లు వార్తలొస్తున్నాయి. కానీ, ఎటువంటి అధికారిక ధ్రువీకరణ రాలేదు. మరో బస్సుపై కొండచరియలు విరిగిపడటంతో డ్రైవర్ మృతి చెందాడు. 24 మంది ప్రయాణికులతో ఓ బస్సు కాఠ్‌మాండూ వెళుతోంది. మరో బస్సులో 41 మంది ఉన్నట్లు గుర్తించారు. వీటిని గణపతి డీలక్స్, ఏంజెల్ బస్సులుగా గుర్తించారు. వీటిల్లో గణపతి డీలక్స్‌కు చెందినదిగా భావిస్తున్న బస్సు నుంచి ముగ్గురు ప్రయాణికులు తప్పించుకొన్నారు. బస్సు ప్రమాదానికి గురికాగానే వారు దానిలోనుంచి బయటకు దూకేసినట్లు కాఠ్‌మాండూ పోస్టు పేర్కొంది. అదే మార్గంలో మరోచోట కూడా బస్సుపై కొండచరియ విరిగిపడటంతో దాని డ్రైవర్ తీవ్రంగా గాయపడి మృతి చెందారు. ఈ బస్సు బుట్వాల్ నుంచి కాఠ్‌మాండూకు వెళుతోంది. మృతుడిని మేఘ్‌నాథ్‌గా గుర్తించారు. ఈ ఘటనపై నేపాల్ ప్రధాని పుష్పకమల్ దహల్ విచారం వ్యక్తంచేశారు. ప్రభుత్వ ఏజెన్సీలు అక్కడ బాధితుల గాలింపునకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ దేశ సాయుధ దళాలు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి.

## వ్యవసాయ శాఖపై మంత్రి అచ్చెన్న కీలక నిర్ణయాలు

అమరావతి: వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ , పశుసంవర్థక, డెయిరీ డెవలప్మెంట్, మత్స్యశాఖామంత్రిగా అచ్చెన్నాయుడు నేడు ఏపీ సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వ్యవసాయ శాఖామంత్రిగా నేడు అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఏపీ ప్రధానంగా వ్యవసాయ ఆధారిత రాష్ట్రమని తెలిపారు. రాష్ట్ర జనాభాలో 62శాతం మంది 3.02 కోట్ల మంది వ్యవసాయం, వ్యవసాయ అనుభంద రంగాలపై ఆధారపడి ఉన్నారని తెలిపారు. వ్యవసాయం, సహకారం, మార్కెటింగ్, పశుసంవర్థక, డెయిరీ డెవలెప్మెంట్, మత్స్య శాఖలను తనకు చంద్రబాబు నాయుడు అప్పగించారని అన్నారు. ఈ రంగాన్ని ఏ ప్రభుత్వమైన అత్యంత ప్రాధాన్యమైనదిగా తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. 2019 నుంచి 2024 వరకూ ఈ రాష్ట్రాన్ని పాలించిన జగన్ రెడ్డి ఈ శాఖకు తాళం వేశారని అన్నారు. వ్యవసాయంలో అత్యంత ప్రాధాన్యం కలిగింది భూమి కాబట్టి భూసారాన్ని ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరీక్ష చేయలేదని చెప్పారు. గడచిన ఐదేళ్లలో ఒక్క భూసార పరీక్ష కూడా చేయలేదని చెప్పారు. విత్తనాలు, ఎరువులు లేవు, పండించిన పంటకు గిట్టుబాటు ధరలేదని అన్నారు. పంట అమ్ముకుంటే ఐదారు మాసాలకు డబ్బులు ఇవ్వలేదని చెప్పారు. ఎన్డీఏ ప్రభుత్వం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఏపీలోని ప్రతి రైతు ధైర్యంగా ఉంటారని అన్నారు. ఏ రైతుకు ఏ సమస్య ఉన్నా ప్రభుత్వానికి సమాచారం ఇవ్వాలని కోరారు. సాధ్యమైనంత వరకూ ఆ సమస్యకు పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. 2014 నుంచి 2019 వరకూ వ్యవసాయ అనుభంద రంగాలకు ఎలాంటి కార్యక్రమాలు చేశారో అవన్నీ మళ్లీ పునప్రారంభించామని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు ఇచ్చారని అన్నారు. అందులో భాగంగానే మూడు డిపార్ట్‌మెంట్లలో 6 ఫైళ్లపై సంతకం చేశానని వివరించారు. వ్యవసాయ శాఖలో మొదటిది పొలం పిలుస్తోంది... ఈ కార్యక్రమాన్ని 23 వ తేదీన రాష్ట్రం మొత్తం మీద ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రతి మంగళవారం, బుధవారం వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ అనుబంధ అధికారులు, ప్రజాప్రతినిధులు పొలాల దగ్గరకు వెళ్లి రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందించాలని కోరారు. ఖరీఫ్, రబీలో నాలుగు మాసాల పాటు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. రెండోసంతకం రైతుకు వ్యక్తిగత యాంత్రీకరణ పరికరాలు అందిచడంపై చేశామని వివరించారు. గత ఐదు సంవత్సరాల్లో యాంత్రీకరణ అనేమాటే ఈ రాష్ట్రంలో వినింపిచలేదని చెప్పారు. గతంలో టీడీపీ హయాంలో 3.24 లక్షల మంది రైతులకు రూ.988 కోట్లు ఖర్చు పెట్టి వ్యక్తిగతంగా సబ్సిడీపై యాంత్రీకరణను ప్రోత్సహించామని చెప్పారు. ఈ ఐదేళ్లలో చివరకు కొడవలి పిడి కూడా ఇవ్వలేదని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## ఆప్కో చేనేతలో అక్రమాలపై మంత్రి సవిత రియాక్షన్

అనంతపురం, జూలై 12: ఆప్కో చేనేతలో జరిగిన అక్రమాలపై వచ్చిన కథనంపై చేనేత జౌళి శాఖ మంత్రి సవిత స్పందించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నేతన్నలకు మరణ శాసనం రాశారని విమర్శించారు. గత 5 సంవత్సరాలుగా ఆప్కో, చేనేతలో జరిగిన కుంభకోణంపై విచారణ చేపడుతామని తెలిపారు. ఆప్కో చేనేత కార్మికులను స్వలాభం కోసం నాశనం చేశారన్నారు.

ఉపాధి లేక ఇతర ప్రాంతాలకు చేనేత కార్మికులు వలస వెళ్తున్నారన్నారు. చేనేత రంగాన్ని రాష్ట్రంలో నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. జరిగిన అన్నింటిపైనా విచారణ జరిపిస్తామన్నారు. నేతన్న నేస్తం పేరుతో వైసీపీ కార్యకర్తలకు నేతన్న నేస్తం ఇచ్చారన్నారు. సబ్సిడీపై ముడిసరుకు పనిముట్లు ఇస్తున్నామన్నారు. సొసైటీలను ఏర్పాటు చేసి చేనేత కార్మికులను ఆదుకుంటామని స్పష్టం చేశారు.



గత ప్రభుత్వంలో వైసీపీ కార్యకర్తలకు పెద్ద పీటవేశారన్నారని వ్యాఖ్యలు చేశారు. తెలుగుదేశం ప్రభుత్వంలో అర్హులైన ప్రతి చేనేత కార్మికుడిని ఆదుకుంటామని మంత్రి సవిత హామీ ఇచ్చారు.

# 'పొలిమేర 2' ఫేం కామాక్షికి ఫాల్కే పురస్కారం

తెలుగమ్మాయిలు బోల్డ్ గా మాట్లాడటం బోల్డ్ ఫోటోషూట్లతో విరుచుకుపడడం అన్నది నేటి ట్రెండ్. ఇప్పుడు కాలం మారింది. సీజన్ వచ్చింది. ఇటీవల తెలుగమ్మాయిల బోల్డ్ ఫోటోషూట్లు మతులు చెడగొడుతున్నాయి. ఏంజెలినా జోలీ, జెన్నిఫర్ లోపేజ్, మడోన్నాకు వీళ్లేమీ తక్కువ కాదు అని ప్రూవ్ చేస్తున్నారు. చాలా మంది ఇతర తెలుగమ్మాయిల్లానే టాలీవుడ్ లో ప్రవేశించి సత్తా చాటుతోంది కామాక్షి భాస్కర్ల. 'మా ఊరి పొలిమేర 2'లో ఈ భామ నటనకు తెలుగు ప్రజలు ఫిదా అయిపోయారు. డీగ్లామరస్ పాత్రలో ఎంతో అద్భుతంగా నటించి మెప్పించారు కామాక్షి. అంతేకాదు కామాక్షి బోల్డ్ ఇంటర్వ్యూలు అప్పట్లో ఎంతో వైరల్ అయ్యాయి. ప్రచార వేదికపైనా హరీష్ శంకర్ ని మిరపకాయ్ అంటూ సూటిగా పిలుస్తూ మాట్లాడినా... .. మిస్ ఇండియా పోటీలు పెద్ద మాఫియా! అని బోల్డ్ కామెంట్ చేసినా



కామాక్షి సూటిగా సుత్తి లేకుండా మాట్లాడింది. అందుకే ఈ భామకు ప్రత్యేకించి ఫ్యాన్స్ ఏర్పడ్డారు. ఇప్పుడు కామాక్షి భాస్కర్ల బోల్డ్ ఫోటోషూట్ ఒకటి ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. సింపుల్ గా కనిపిస్తూనే అందమైన డిజైనర్ ఫ్రాక్‌లో థై ఎలివేషన్ తో మతులు చెడగొడుతున్న ఈ ఫోటోషూట్ క్షణాల్లో అంతర్జాలంలో వైరల్ అయింది. తెలుగమ్మాయి టూమచ్ గా చెలరేగుతోందే! అంటూ అభిమానులు ఘాటుగా దీనిపై వ్యాఖ్యానిస్తున్నారు. కామాక్షి బోల్డ్.. కామాక్షి బ్యూటిఫుల్.. భవిష్యత్ ఈ అమ్మడిదే! అంటూ ఫ్యాన్స్ పిచ్చెక్కుతున్నారు. ఈ ఫోటోషూట్ తో పాటు 14వ దాదా సాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉత్తమ నటి అవార్డును సొంతం చేసుకున్న కామాక్షి భాస్కర్లకు శుభాకాంక్షలు చెబుతున్నారు యూత్. గత ఏడాది విడుదలై ఘన విజయం సాధించిన 'మా ఊరి పొలిమేర 2'లో లక్ష్మి పాత్రలో తన ఇంటెన్స్ పెర్ఫామెన్స్‌కుగానూ ఈ పురస్కారం దక్కింది. అనిల్ విశ్వనాథ్ తెరకెక్కించిన ఈ సినిమాతో కామాక్షి గుర్తింపు విశ్వవిఖ్యాతం అయింది. ఇప్పుడు పురస్కారంతో అది మరింత అదనపు హంగును అద్దుకుంది. అనూహ్యంగా ఇలా ఫాల్కే పురస్కారాల్లో ఉత్తమ నటిగా అవార్డు గెలవటం థ్రిల్లింగ్‌గా ఉందని కామాక్షి ఆనందం వ్యక్తం చేస్తోంది. తన నటగురువు శేఖర్, నీజర్ కబీకి ధన్యవాదాలు తెలిపింది. అయితే మా ఊరి పొలిమేర 2లో తన ప్రదర్శనకు ఇంతటి ప్రతిష్ఠాత్మక అవార్డ్ వస్తుందని ఊహించలేదని కూడా అంది. మా ఊరి పొలిమేర 2' చిత్రం బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లను సాధించటమే కాకుండా ప్రేక్షకుల, విమర్శకుల నుంచి ప్రశంసలను అందుకుంది.

# శ్రుతిహాసన్.. ఆ సమస్యతో పోరాటం!

స్త్రీలకు ఉండే అనారోగ్య సమస్యల గురించి పుంఖానుపుంఖాలుగా కథనాలు అంతర్జాలంలో అందుబాటులో ఉన్నాయి. యూట్యూబ్‌లో నిరంతరం ఇవి హోరెత్తుతూనే ఉంటాయి. డిజిటల్ మీడియా వల్ల ప్రజల్లో అవేర్‌నెస్ చాలా పెరిగింది. ఇక మెజారిటీ స్త్రీలు భరించే ఒక రెగ్యులర్ అనారోగ్య సమస్య- పిసిఓఎస్. దీనినే అధిక రక్త స్రావం అని కూడా పిలుస్తారు. రక్తం ఎక్కువగా కారిపోవడం వల్ల శారీరక బలహీనతన ఎదుర్కోవడం..! ఈ సమస్య వల్ల ఏకాగ్రతను కోల్పోతారు. బాధ భరించలేనంతగా ఉంటుంది. ఏ పనీ చేయలేరు. ఓచోట కూచోలేరు.. నిలుచోలేరు. ఇలాంటి అరుదైన వ్యాధితో చాలా మంది ఆడవాళ్లు బాధపడుతుంటారు. ఇలాంటి అనారోగ్య సమస్య తనకు కూడా ఉందని, ఇది తనను నిరంతరం చాలా ఇబ్బందులకు గురి చేస్తోందని స్టార్ హీరోయిన్ శ్రుతిహాసన్ బహిరంగంగా వెల్లడించారు. తాను పిసిఓఎస్ (పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్) మరియు ఎండోమెట్రియోసిస్‌తో బాధపడుతున్నట్లు వెల్లడించారు. ఇటీవల



ఇన్‌స్టాలో తన వ్యాయామ వీడియోను షేర్ చేసిన శ్రుతి తన శీర్షికలో రెండు అనారోగ్యాలతో తన యుద్ధం గురించి పేర్కొంది. తాను చెత్త హార్మోన్ల సమస్యలను ఎదుర్కొంటున్నట్లు శ్రుతి పేర్కొంది. తన రుగ్మతల గురించి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ ఫిట్నెస్ గోల్స్ ఉండాలని సూచించింది. శ్రుతి హాసన్ పిసిఓఎస్‌తో తన సుదీర్ఘ పోరాటం గురించి మాట్లాడారు. ఈ అనారోగ్య సమస్య వల్ల అసమతుల్యతను ఎదుర్కొన్నాను. ఉబ్బరం జీవక్రియ సవాళ్లతో కఠినమైన పోరాటం చేయాలనేది చాలామంది మహిళలకు తెలుసు. కానీ దానిని పోరాటంగా చూసే బదులు.. సమయానికి తనడం, బాగా నిద్రపోవడం, వ్యాయామాన్ని ఆస్వాధించడం చాలా అవసరం. నా శరీరం ప్రస్తుతం పరిపూర్ణంగా లేదు.. కానీ నా హృదయం సంతోషంగా ఉండాలి. ఆ సంతోషకరమైన హార్మోన్లు ప్రవహించనివ్వండి! అని శ్రుతి ఇన్‌స్టాలో రాసారు. తనకు ఉన్న సమస్య వల్ల షూటింగుల్లోను ఇబ్బందులు తలెత్తాయని కానీ బాధను భరిస్తూనే తాను నటించేదానిని అని శ్రుతి తెలిపారు. కామెడీ సీన్లలో నవ్వించాను.. డ్యాన్స్ ఫ్లోర్ పై డ్యాన్సులు చేసాను.. చాలా ఇబ్బందులు పడ్డాను. కానీ వాటిని దర్శకనిర్మాతలకు ఎప్పటికీ చెప్పలేను ఆ సమయంలో అని శ్రుతి వెల్లడించారు. అయితే శ్రుతిహాసన్ వ్యక్తిగత జీవితంలో పెను సవాళ్లను ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఇప్పటికి మూడు సార్లు బోయ్ ఫ్రెండ్స్ నుంచి బ్రేకప్ అయింది. తొలుత ప్రముఖ స్టార్ హీరో నుంచి విడిపోయిన శ్రుతి హాసన్ ఆ తర్వాత విదేశీ ప్రియుడు మైఖేల్ కోర్సలే నుంచి విడిపోయింది. ఇటీవలే డూడుల్ ఆర్టిస్ట్ శంతను హజారిక నుంచి బ్రేకప్ అయ్యి ఒంటరిగా ఉన్నానని ప్రకటించింది. నేను సింగిల్.. మింగిల్ అవ్వడానికి రెడీగా ఉన్నాను! అంటూ కవిత్వం కూడా రాసింది.




# లవ్ మీ.. ఇంతకీ ఆ దెయ్యం ఎవరు?




టాలీవుడ్‌లోకి చాలా రోజుల తరువాత విభిన్నమైన ప్రేమకథా చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. అదే "లవ్ మీ" అనే సినిమా. ఈ హీరో ఓ దెయ్యంతో ప్రేమలో పడిపోవడం చుట్టూ కథ తిరుగుతుంది. సినిమాలో ఆశిష్ మరియు వైష్ణవి చైతన్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే టీజర్ ట్రైలర్ లను విడుదల చేశారు. వాటికి మంచి రెస్పాన్స్ దక్కింది. ఇక సినిమాలో హారర్ విజువల్స్ తో పాటు మంచి లవ్ ట్రాక్ హైలెట్ కానున్నట్లు చెప్పారు. అయితే దెయ్యం పాత్రను ఎవరు పోషించారో మాత్రం చిత్రబృందం వెల్లడించలేదు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఆశిష్ ఈ విషయంలో ఆసక్తికరమైన సమాధానం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. ఈ చిత్రంలో మొత్తం ఐదుగురు హీరోయిన్లు ఉన్నారు. వారి వివరాలను ఇప్పటివరకు ఎవరికి తెలియనీయలేదు. ప్రేక్షకులు థియేటర్‌లో ఈ సర్‌ప్రైజ్ ఎలిమెంట్స్‌ని ఆస్వాదించాలని మేము కోరుకుంటున్నాం. వైష్ణవి చైతన్య ప్రధాన హీరోయిన్ అని చెప్పారు. ఇక సినిమాలో మిగతా మహిళా పాత్రలు కథను ముందుకు తీసుకువెళ్తాయి. దెయ్యం పాత్రను పోషించిన వ్యక్తిని కూడా కలుపుకుంటే, 'లవ్ మీ' లో మొత్తం ఆరుగురు హీరోయిన్లు ఉన్నారుని తెలిపారు. ఈ చిత్రానికి అరుణ్ భీమవారపు దర్శకత్వం వహిస్తున్నారు, మరియు హర్షిత్ రెడ్డి, హంషిత, నాగ మల్లిడి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి ఈ చిత్రానికి సంగీతం అందించగా, పి.సి. శ్రీరామ్ సినిమాటోగ్రాఫర్‌గా ఉన్నారు. "లవ్ మీ" చిత్రం మే 25న విడుదల కానుంది. ఇక సినిమాకు సంబంధించిన మరొక పాటను విడుదల చేశారు. ఏమవుతుందో అనే ఈ పాటలో ఆశిష్, దెయ్యం మధ్యలో కెమిస్ట్రీ హైలెట్ అవుతోంది. ఒకవైపు ప్రేమను మరోవైపు థ్రిల్లింగ్ ఏమోషన్ ను పాటలో చూపించారు. కీరవాణి మెలోడీ మ్యూజిక్ కు తగ్గట్టుగా చంద్రబోస్ రచన, నితీష్ – గోమతి అయ్యర్ పాడిన విధానం పాటకు మరింత అందాన్ని ఇచ్చింది. దెయ్యంతో పూర్తిగా ప్రేమలో పడిన కుర్రాడు ఆ ఆత్మతో ఇంత రిస్క్ ఎందుకు చేస్తాడు అనేది తెలియాలి అంటే సినిమా వచ్చే వరకు ఆగాల్సిందే. ఈ సినిమాలోని సర్‌ప్రైజ్ ఎలిమెంట్స్, విభిన్నమైన కథ, మరియు ఐదుగురు హీరోయిన్ల పాత్రలు ప్రేక్షకులను మరింత ఆకట్టుకోవడం ఖాయం అని చెబుతున్నారు. దెయ్యం పాత్రను ఎవరు పోషించారో తెలియడం సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతుంది. ఆశిష్ మాట్లాడుతూ, సినిమా యొక్క ప్రతి సన్నివేశం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు. మరి ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి.

# అత్యధిక లాభాలు తెచ్చిన సినిమాలివే




టాలీవుడ్ లో గత కొన్నేళ్ల నుంచి పాన్ ఇండియా సినిమాల ట్రెండ్ నడుస్తోంది. స్టార్ హీరోలు అందరూ కూడా యూనివర్శల్ కథలపై ఫోకస్ చేసి పాన్ ఇండియా ప్రాజెక్ట్స్ చేస్తున్నారు. ఇలా చేయడం వలన అన్ని భాషలలో ప్రేక్షకులకి రీచ్ కావొచ్చు. అలాగే మార్కెట్, బ్రాండ్ ఇమేజ్ కూడా పెంచుకోవచ్చుని స్టార్స్ అందరూ భావిస్తున్నారు. దానికి తగ్గట్లుగానే టాలీవుడ్ సినిమాలు భారీ కలెక్షన్స్ ని అందుకుంటున్నాయి. ఎక్కువ భాషలలో రిలీజ్ కావడం వలన నిర్మాతలు కూడా మంచి లాభాలని ఆర్జిస్తున్నారు. తెలుగులో అత్యధిక ఆదాయం ఆర్జించిన సినిమాల జాబితాలో చూసుకుంటే రాజమౌళి బాహుబలి 2 మూవీ టాప్ 1లో ఉంది. ఈ సినిమాపై 352 కోట్ల బిజినెస్ వరల్డ్ వైడ్ గా జరిగింది. 508 కోట్ల ప్రాఫిట్ ని ఈ సినిమా ద్వారా నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్స్ సొంతం చేసుకున్నారు. దీని తర్వాత అత్యధిక లాభాలు తెచ్చిపెట్టిన రెండో సినిమాగా బాహుబలి 1 నిలిచింది. ఈ మూవీపైన 118 కోట్ల వ్యాపారం జరిగింది. 186 కోట్ల ప్రాఫిట్ దక్కించుకుంది. ఇక జక్కన్న మరో సినిమా ఆర్ఆర్ఆర్ మూవీ 451 కోట్ల బ్రేక్ ఈవెన్ తో థియేటర్స్ లోకి వచ్చి 163.03 కోట్ల ప్రాఫిట్ ని అందించింది. చిన్న సినిమాగా రిలీజ్ అయిన హనుమాన్ మూవీ 29.65 కోట్ల బిజినెస్ టార్గెట్ తో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఓవరాల్ గా 127.95 కోట్ల లాభాలని తెచ్చిపెట్టింది. దీని తర్వాత టాప్ 5లో డార్లింగ్ కల్కి2898ఏడీ మూవీ నిలవడం విశేషం. ఈ సినిమాపై 370 బిజినెస్ అయ్యింది. ఇప్పటి వరకు 80.40 కోట్ల ప్రాఫిట్ ని అందుకుంది. హనుమాన్ ప్రాఫిట్ ని కల్కి బ్రేక్ చేసే ఛాన్స్ ఉందనే మాట వినిపిస్తోంది. నెక్స్ట్ అల్లు అర్జున్ అల వైకుంఠపురంలో మూవీ అత్యధిక ప్రాఫిట్ సినిమాల జాబితాలో టాప్ 6లో ఉండటం విశేషం. ఈ సినిమా 84.34 కోట్ల బిజినెస్ ని వరల్డ్ వైడ్ గా చేసింది.

75.88 కోట్ల ప్రాఫిట్ ని లాంగ్ రన్ లో అందుకుంది. రీజనల్ సినిమాగా వచ్చి అత్యధిక ప్రాఫిట్ సొంతం చేసుకున్న చిత్రంగా ఈ మూవీ ఉంది. నెక్స్ట్ జాబితాలో విజయ్ దేవరకొండ గీతాగోవిందం నిలిచింది. ఈ మూవీ 15 కోట్ల బిజినెస్ మాత్రమే చేసిన లాంగ్ రన్ లో ఏకంగా 55.43 కోట్ల ఆదాయం తెచ్చిపెట్టింది. టాప్ 7 హైయెస్ట్ ప్రాఫిట్ చిత్రాల జాబితాలో గీతాగోవిందం మూవీ నిలిచింది.

# అందాల జలకన్య

కన్నడ మూవీ శంకర్ ఐపీఎస్ సినిమాతో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ కేథరిన్ తెర్సా. ఈ అమ్మడు కన్నడం తో పాటు తెలుగు మరియు తమిళం భాషల్లో కూడా సినిమాలు చేసి మంచి గుర్తింపును దక్కించుకుంది. టాలీవుడ్ లో ఎన్నో సినిమాల్లో నటించిన ఈ అమ్మడికి ఇప్పటికి కూడా మంచి క్రేజ్ ఉంది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి చాలా కాలం అయినా కూడా ఈ అమ్మడు ఇంకా ఏదో ఒక భాష లో సినిమాలు చేస్తూ కెరీర్ ను నెట్టుకు వస్తుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఒక హీరోయిన్ పదేళ్ల పాటు సినిమా ఇండస్ట్రీలో కొనసాగడం అంటే మామూలు విషయం కాదు. ఈ అమ్మడి అందమే ఇన్నాళ్ల ఇండస్ట్రీ జర్నీకి కారణం అని చెప్పుకోవచ్చు. రెగ్యులర్ గా అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేస్తూ ఆకట్టుకునే ఈ అమ్మడు మరోసారి తన అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేసి అందరి దృష్టిని



ఆకర్షించింది. ఈసారి జలకన్య వేషంలో కన్నుల విందు చేసింది. స్విమ్మింగ్ పూల్ లో ఈ అమ్మడు స్విమ్ చేస్తూ కనిపించింది. తడిసిన అందాలతో కేథరిన్ తెర్సా ఫోటోలకు ఇచ్చిన ఫోజ్ లకు కుర్రకారు ఫిదా అవుతున్నారు. మొదటి సినిమాతో పోల్చితే కేథరిన్ ఇప్పుడు ఇంకాస్త అందంగా ఆకర్షణీయంగా తయారు అయ్యిందని, వయసు పెరుగుతున్నా కొద్ది ఈ అమ్మడి అందం పెరగడం విడ్డూరంగా ఉందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ అమ్మడి సినిమాల విషయానికి వస్తే... తెలుగు లో ఈ మధ్య కాలంలో వరల్డ్ ఫేమస్ లవర్, భళా తందానా, బింబిసార, మాచర్ల నియోజకవర్గం సినిమాలతో పాటు పలు సినిమాల్లో ముఖ్య పాత్రల్లో నటించడంతో పాటు కొన్ని సినిమాల్లో ఐటం సాంగ్స్ ని కూడా చేసింది.

# రాణి ఉత్పలాదేవిగా మీరాజాస్మిన్!

పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న తాజా చిత్రం 'SWAG'. మీరా జాస్మిన్ ఈ చిత్రంతో రీఎంట్రీ ఇస్తున్నారు. టైటిల్ స్టోరీ గ్లింప్స్ .. క్వీన్ గ్లింప్స్ ని రిలీజ్ చేసిన తర్వాత 'స్వాగ్' ప్రపంచం ఇప్పుడు ఎవర్‌గ్రీన్ బ్యూటీ మీరా జాస్మిన్‌ను పరిచయం చేసింది. రాణి ఉత్పలాదేవిగా మీరాజాస్మిన్ లుక్ హెడ్ టర్నర్ గా మారింది. అత్యున్నత స్థాయి రాణి ఉత్పలాదేవి సానుభూతి స్వభావం కారణంగా సింహాసనాన్ని కోల్పోతుంది. ఈ పాత్ర సినిమాకే హైలైట్ గా ఉంటుందని చిత్రబృందం చెబుతోంది. తాజాగా క్యారెక్టర్ ఇంట్రడక్షన్ పోస్టర్ లో మీరా జాస్మిన్ భారీ ఆభరణాలు డిజైనర్ దుస్తుల్లో రాణి అంటే ఇలా ఉండాలి! అనిపించేంత దర్పంతో అందంగా కనిపిస్తోంది. నిజంగా




ఈ పాత్రలో మీరా సముచితంగా కనిపిస్తోంది. గుడుంబా శంకర్, భద్ర లాంటి కమర్షియల్ చిత్రాల్లో ట్రెడిషనల్ గాళ్ లుక్ లో కనిపించిన మీరా జాస్మిన్ గ్లామరస్ పాత్రలకు భిన్నమైన పాత్రలను ఎంచుకుని అలరించింది. ఇప్పుడు రాణి పాత్రలో అంతకుమించి యాప్ట్ గా కనిపిస్తోందని చెప్పాలి. చాలా కాలంగా విరామం తీసుకున్న మీరా జాస్మిన్ ఈ సినిమాతో మరోసారి టాలీవుడ్ లో సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతోంది. స్వాగ్‌లో మీరా కీలకమైన పాత్రలో ఆశ్చర్యపరుస్తుందని చిత్రబృందం చెబుతోంది. శ్రీ విష్ణువు, హసిత్ గోలీ పునకలయికలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టిజి విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. రీతూ వర్మ వింజమారా వంశానికి చెందిన క్వీన్ రుక్మిని దేవి పాత్రలో నటిస్తోంది. ఇది పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రం. వేదరామన్ శంకరన్ ఈ చిత్రానికి ఛాయాగ్రాహకుడు. వివేక్ సాగర్ సంగీతాన్ని అందిస్తున్నారు. వివేక్ కుచిభోట్లా సహ నిర్మాత. రచన-దర్శకత్వం: హసిత్ గోలీ.



## 16న హైదరాబాద్‌లో జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్.. 9 అంశాలతో అజెండా

హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఈనెల 16న సచివాలయంలో కీలక సమావేశం జరగనుంది. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో నిర్వహించే రాష్ట్రస్థాయి కాన్ఫరెన్స్‌లో పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. దీనికి సంబంధించిన అజెండాను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారి ఖరారు చేశారు. మొత్తం 9 అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు. వాటికి సంబంధించిన వివరాలతో హాజరుకావాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లను సీఎస్ ఆదేశించారు. ఇటీవలే అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులతో ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించారు. కొందరు కలెక్టర్లు కార్యాలయాలకే పరిమితమవుతున్నారని.. క్షేత్రస్థాయిలో పాలనా వ్యవస్థ మరింత పటిష్ఠం కావాలని దిశానిర్దేశం చేశారు.

తాను వారానికో జిల్లాలో పర్యటించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించనున్నట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశం ఏర్పాటు చేశారు.

**అజెండాలోని అంశాలివే..** ప్రజాపాలన, ధరణి, వ్యవసాయం, ఆరోగ్యం– సీజనల్ వ్యాధులు, వన మహోత్సవం, మహిళా శక్తి, విద్య, శాంతిభద్రతలు, డ్రగ్స్ నిర్మూలన క్యాంపెయిన్

## గాంధీ భవన్‌కు.. తెలంగాణ భవన్‌కు తేడా లేదు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్: అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో కష్టపడి పని చేసి మంచి ఫలితాలు సాధించిన కార్యకర్తలకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ అమరుల ఆకాంక్షలను నెరవేర్చేది భాజపా ఒక్కటేనని చెప్పారు. గాంధీ భవన్‌కు.. తెలంగాణ భవన్‌కు తేడా లేదని కాంగ్రెస్, భారాసలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. శంషాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర భాజపా విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హాజరుకాగా.. రాష్ట్రానికి చెందిన మరో కేంద్రమంత్రి బండి సంజయ్, భాజపా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. "భాజపాకు ఓట్లు, సీట్లు ఇచ్చిన తెలంగాణ ప్రజలకు సెల్యూట్. ప్రస్తుత ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించిన మల్కాజ్‌గిరి గడ్డపై కాషాయ జెండా ఎగిరింది. ఆయన సొంత జిల్లాలోనూ భాజపాదే ఆధిపత్యం. పార్టీ ఓటు బ్యాంకు 14 నుంచి 35 శాతానికి పెరగడం సాధారణ విషయం కాదు. పదేళ్లు పాలించిన భారాస ఒక్క ఎంపీ సీటు గెలవలేక ప్రజాగ్రహానికి గురైంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం



అతి తక్కువ కాలంలోనే ప్రజా విశ్వాసం కోల్పోయింది. ఆ పార్టీ వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చింది. వంద రోజులు దేవుడెరుగు.. ఎనిమిది నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయలేదు. ఫిరాయింపుల విషయంలో కేసీఆర్ తరహాలోనే కాంగ్రెస్ వెళ్తోంది" అని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.



### అగమ్యగోచరంగా బ్రహ్మణ సంక్షేమ పరిషత్.. తెలంగాణ సీఎం రేవంత్‌కు హరీశ్ బహిరంగ లేఖ

హైదరాబాద్: బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అగమ్యచోరంగా మారిందని భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. విద్య, ఉపాధి వంటి పథకాలు ఆగిపోవడం విచారకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమాన్ని విస్మరించిందని పేర్కొన్నారు. పేద బ్రాహ్మణులకు సంక్షేమ కార్యక్రమాలు కొనసాగించాలని డిమాండ్ చేశారు.

## నా అకౌంట్ మాజీ మంత్రి బ్లాక్ చేశారు.. షబ్బీర్ అలీ హాట్ కామెంట్స్

హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ వైఫల్యాలపై అధ్యయనానికి ఏఐసీసీ అధిష్టానం కురియన్ కమిటీని నియమించిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో రెండు రోజులుగా పలువురు కాంగ్రెస్ నేతలను పిలిచి వివరాలను తీసుకుంటుంది. పోటీ చేసిన అభ్యర్థులతో కురియన్ కమిటీ విడివిడిగా మాట్లాడుతుంది. ఒక్కో అభ్యర్థికి 30 నిమిషాల సమయాన్ని కమిటీ కేటాయించింది. ఈరోజు(శుక్రవారం) కురియన్ కమిటీతో ప్రభుత్వం సలహాదారు షబ్బీర్ అలీ ముందు హాజరయ్యారు.

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఓట్ల తేడా అడిగారని షబ్బీర్ అలీ తెలిపారు. నిజామాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోవడానికి గల కారణాలను అడిగారని చెప్పారు. నిజామాబాద్ అర్బన్‌లో కాంగ్రెస్‌కు



17 వేల మెజార్టీ వచ్చిందని చెప్పానని అన్నారు. కామారెడ్డిలో పార్లమెంట్, అసెంబ్లీ లో మెజార్టీ చెప్పానని వివరించారు.

## వారిని స్వయంగా కేసీఆరే పంపుతున్నారు... చేరికలపై బండి హాట్ కామెంట్స్

హైదరాబాద్, జూలై 12: బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే ఈ చేరికలకు సంబంధించి కేంద్రమంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. స్వయంగా కేసీఆర్.. సొంత ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి పంపుతున్నారని అన్నారు. తెలంగాణ ప్రజల ఏకైక గ్యారంటీ నరేంద్ర మోదీ అని తెలిపారు. అవినీతి నుంచి బయట పడేందుకు కాంగ్రెస్‌కు కేసీఆర్ సహకరిస్తున్నారని ఆరోపించారు. సెక్యూరిటీ లేకుండా.. రాహుల్ గాంధీ ఉస్మానియా యూనివర్సిటీకి రావాలని సవాల్ విసిరారు. నిరుద్యోగులను పోలీసుల ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం అణిచివేస్తోందని కేంద్ర మంత్రి మండిపడ్డారు. రాహుల్ గాంధీని సొంత పార్టీ వారే ప్రధాని అభ్యర్థిగా అంగీకరించలేదన్నారు.

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తలకు పెద్ద పీఠ వేస్తుందన్నారు. బీజేపీ కార్యకర్తల గెలుపే రాష్ట్ర బీజేపీ నాయకత్వం లక్ష్యమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల హామీతో తెలంగాణ ప్రజలు మోసపోయారన్నారు. కాంగ్రెస్‌ను ప్రజలు వ్యతిరేకించారనటానికి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు నిదర్శనమన్నారు.



తెలంగాణ ప్రజాప్రతినిధులు కూడా నరేంద్ర మోదీ మాత్రమే గ్యారంటీ అంటున్నారన్నారు. ధర్మం, తెలంగాణ పేదల కోసం పోరాడేది బీజేపీ మాత్రమే అని చెప్పుకొచ్చారు. బీజేపీ కార్యకర్తల పోరాటం వలనే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి 8సీట్లు వచ్చాయన్నారు. రైతులను మోసం చేసే విషయంలో బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తోందన్నారు.

## వరంగల్ జిల్లాలో జంట హత్యల కేసు నిందితుడు అరెస్టు

నర్సంపేట: వరంగల్ జిల్లాలో జంట హత్యల కేసులో నిందితుడు నాగరాజును అరెస్టు చేసినట్టు డీసీపీ రవీందర్ తెలిపారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పదహారు చింతల్‌తండాలో జరిగిన దారుణ ఘటన వివరాలను నర్సంపేట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీసీపీ వెల్లడించారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న అమ్మాయి దక్కట్లేదనే హత్యలు చేశాడు. 9వ తరగతి నుంచి అమ్మాయి, ఆటో డ్రైవర్ మేకల నాగరాజు అలియాస్ బన్నీతో పరిచయం ఉంది. అమ్మాయి మేజర్ అయ్యాక ఎవరికీ తెలియకుండా పెళ్లి చేసుకున్నారు. కొన్ని రోజుల తర్వాత అతనితో ఉండలేనని దీపిక (21) పుట్టింటికి వచ్చేసింది. దీపిక దక్కకపోవడానికి తల్లిదండ్రులు బానోతు శ్రీనివాస్ (45), సుగుణ (40) కారణమని వారిపై కక్ష పెంచుకుని నాగరాజు హత్య చేశాడు. అందరినీ చంపేద్దామనే గురువారం తెల్లవారుజామున వేట కొడవలి తీసుకొని యువతి ఇంటికి వెళ్లాడు. బయట నిద్రిస్తున్న శ్రీనివాస్, సుగుణలపై విచక్షణ రహితంగా దాడి చేశాడు. తల్లిదండ్రుల కేకలు విని బయటకు వచ్చిన దీపిక, మదన్‌లాల్‌లపై కూడా దాడి చేశాడు. దాడి తర్వాత అడ్డొచ్చిన వారిని బెదిరించి అక్కడి నుంచి పరారయ్యాడు. నిందితుడికి ఎవరూ సహకరించలేదు. హత్య జరిగిన తర్వాత పోలీసులు త్వరగా స్పందించారు. చట్టప్రకారం నిందితుడికి శిక్ష పడేలా చూస్తాం" అని డీసీపీ రవీందర్ తెలిపారు.




## స్మృతి ఇరానీ విషయంలో ఆశ్చర్యపరిచిన రాహుల్ గాంధీ

లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హుందాతనాన్ని ప్రదర్శించారు. తన పట్ల తీవ్ర విమర్శలు గుప్పించే బీజేపీ నాయకురాలు, మాజీ ఎంపీ స్మృతి ఇరానీ పట్ల అవమానకరమైన పదాలు ఉపయోగించవద్దంటూ కాంగ్రెస్ శ్రేణులను కోరారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. "రాజకీయ జీవితంలో గెలుపు, ఓటములు సహజం. ఆమె పట్ల అవమానకరమైన భాష, అసభ్యకరమైన పదాలు ఉపయోగించడాన్ని మానుకోవాలని ప్రతి ఒక్కరినీ కోరుతున్నాను. వ్యక్తులను అవమానపరచడం, అభాసుపాలు చేయడం బలహీనతకు సంకేతం. బలం కాదని తెలుసుకోవాలి" అని రాహుల్ వ్యాఖ్యానించారు. రాహుల్ స్పందించిన తీరుపై రాజకీయ వర్గాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. హుందాతనాన్ని చూపించారని వ్యాఖ్యానిస్తున్నారు. అమేథీ నియోజకవర్గ అభివృద్ధిని రాహుల్ గాంధీ పట్టించుకోరంటూ స్మృతి ఇరానీ ఎన్నోసార్లు విమర్శించారు. రాహుల్‌ని హేళన చేస్తూ మాట్లాడిన పలు సందర్భాలు కూడా ఉన్నాయి. గాంధీ కుటుంబం, ముఖ్యంగా రాహుల్ గాంధీ అమేథీ ప్రజలు పేదలుగా ఉండాలని కోరుకుంటున్నారని ఆరోపణలు కూడా చేశారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో అమేథీ నియోజకవర్గం నుంచి రాహుల్ గాంధీని స్మృతి ఇరానీ ఓడించారు. అయితే 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఫలితం రివర్స్ అయ్యింది. కాంగ్రెస్ అభ్యర్థి, గాంధీ కుటుంబానికి సన్నిహితుడిగా పేరున్న కిషోరీ లాల్ శర్మ చేతిలో స్మృతి ఇరానీ ఏకంగా 1,67,196 లక్షల ఓట్ల తేడాతో ఓడిపోయారు. మరోవైపు రాహుల్ గాంధీ 2024 ఎన్నికల్లో వయనాడ్, రాయ్ బరేలీ నియోజకవర్గాల నుంచి బంపర్ మెజారిటీతో గెలిచిన విషయం తెలిసిందే. ఇక 2014 లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీ చేతిలో ఇరానీ ఓడిపోయారు.

## కవిత బెయిల్ పిటిషన్‌పై కీలక పరిణామం




న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాత్రపై సీబీఐ సప్లిమెంటరీ ఛార్జిషీట్, డిఫాల్ట్ బెయిల్ పిటిషన్లపై ఈరోజు(శుక్రవారం) విచారణ చేపట్టింది. ఈ కేసులో కవిత పాత్ర, అందుకు సంబంధించిన సాక్ష్యాలతో కూడిన సప్లిమెంటరీ ఛార్జిషీట్‌ను దాఖలు చేసినట్టు సీబీఐ రౌస్‌అవెన్యూ కోర్టుకు తెలిపింది. దానిని పరిగణనలోకి తీసుకోవాలని న్యాయస్థానాన్ని కోరింది. ఈ అంశంపై విచారణ చేపడతామని న్యాయమూర్తి కావేరి భవేజా తెలిపారు. సీబీఐ కేసులో కవితకు డిఫాల్ట్ బెయిల్‌పై విచారణ జరిపింది. సీబీఐ ఛార్జ్ షీట్‌లో తప్పులున్నాయని కవిత తరపు న్యాయవాది నితేష్ రానా న్యాయస్థానానికి చెప్పారు. తప్పులు లేవని సీబీఐ తరపు న్యాయవాది అన్నారు. ఛార్జ్‌షీట్‌లో తప్పులున్నాయని కోర్ట్ ఆర్డర్ ఫైల్ చేశారా అని జడ్జి కావేరి భవేజా అడిగారు. ఛార్జ్‌షీట్‌లో తప్పులున్నాయని కోర్ట్ ఆర్డర్ ఫైల్ చేయాలని జడ్జి కావేరి భవేజా చెప్పారు. కోర్ట్ ఆర్డర్ అప్ లోడ్ కాలేదని కవిత తరపు న్యాయవాది నితేష్ రానా అన్నారు. తదుపరి విచారణను జూలై 22కి రౌస్ అవెన్యూ కోర్టు వాయిదా వేసింది. డిఫాల్ట్ బెయిల్, ఛార్జ్‌షీట్‌లో తప్పులపై విచారణ జరిగేంత వరకు ఛార్జ్ షీట్‌ను పరిగణనలోకి తీసుకునే అంశంపై విచారణ వాయిదా వేయాలని న్యాయవాది నితేష్ రానా చెప్పారు. ఛార్జ్ షీట్‌ను పరిగణలోకి తీసుకునే అంశం కవిత డిఫాల్ట్ బెయిల్‌కి సంబంధం లేదని సీబీఐ తరపు న్యాయవాది వివరించారు. ఛార్జ్‌షీట్ పూర్తిగా లేదని వాదించడం లేదని.. తప్పుగా ఉందని చెబుతున్నానని నితేష్ రానా న్యాయస్థానానికి తెలిపారు.

ఢిల్లీ మద్యం విధానం కేసులో కవితను మార్చి 15న హైదరాబాద్‌లోని ఆమె నివాసంలోనే ఈడీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. 16న ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో సీబీఐ ఆమెను హాజరుపరిచింది. కవిత తిహాడ్ జైలులో ఉండగానే ఏప్రిల్ 11న సీబీఐ అరెస్టు చేసినట్టు ప్రకటించింది. ఆ తర్వాత కవిత బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా రౌస్‌అవెన్యూ కోర్టు తిరస్కరించింది. ట్రయల్ కోర్టు తీర్పును కవిత హైకోర్టులో సవాల్ చేశారు.




## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం.. నాంపల్లి కోర్టు కీలక నిర్ణయం

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం జరిగింది. ఈ కేసు నిందితులుగా ఉన్న భుజంగరావు, రాధా కిషన్, తిరుపతన్న, ప్రణీత్ రావులకు మరోసారి చుక్కెదురైంది. వీరి నలుగురి బెయిల్ పిటిషన్‌ను కోర్టు మరోసారి తిరస్కరించింది. వీరి పిటిషన్లను నాంపల్లి క్రిమినల్ కోర్టు కొట్టివేసింది. అరెస్టు చేసి వంద రోజులైనా చార్చిషీట్ దాఖలు చేయకపోవడం డిఫాల్ట్ బెయిల్ కోసం నిందితులు పిటిషన్ వేశారు. కాగా ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులు నలుగురు మ్యాండేటరీ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. పోలీసులు ఇప్పటివరకు చార్జిషీట్ దాఖలు చేయలేకపోయారంటూ నిందితుల తరుపు న్యాయవాదులు వాదించారు.కేసు నమోదయ్యి, నిందితులను అరెస్ట్ చేసి 100 రోజులు దాటిందని పేర్కొన్నారు. విచారణకు ముందు విచారణ అధికారులు జడ్జి ఛాంబర్‌లోకి వెళ్లారు. ఛార్జిషీట్ వెనక్కి ఇచ్చినంత మాత్రాన వేయనట్టు కాదని పోలీసుల తరుపు న్యాయవాది వాదించారు. విచారణ కీలక దశలో ఉందని, బెయిల్ ఇవ్వొద్దని కోర్టుని పోలీసులు కోరారు. ఇరుపక్షాల వాదనలు పూర్తయిన నేపథ్యంలో కోర్టు వారి బెయిల్‌ను తిరస్కరిస్తున్నట్టు తీర్పు ఇచ్చింది. కాగా ఈ కేసులో ప్రణీత్ రావు ఏ2గా, తిరుపతన్న ఏ3గా, భుజంగరావు ఏ4గా, రాధాకిషన్ రావు ఏ5గా ఉన్నారు.

## ఎమ్మెల్యేలను మేము బీజేపీలో అందుకే చేర్చుకోవట్లేదు.. రఘునందన్ షాకింగ్ కామెంట్స్

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై మెదక్ ఎంపీ రఘునందనరావు తీవ్ర విమర్శలు గుప్పించారు. ఏడు నెలల్లో గులాబీ రంగు మూడు వర్ణాలు అయింది తప్ప.. పాలనలో మార్పు లేదని విమర్శించారు. రాజకీయ వ్యభిచారానికి పాల్పడుతోన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ కు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. పదవికి రాజీనామా చేస్తేనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బీజేపీలో చేర్చుకుంటామని స్పష్టం చేశారు. బీజేపీలో చేరటానికి చాలా మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈరోజు(శుక్రవారం) బీజేపీ కార్యాలయంలో మీడియాతో రఘునందన్ మాట్లాడుతూ... ఉప ఎన్నికకు సిద్ధంగా ఉంటేనే చేర్చుకుంటామని టచ్‌లో ఉన్న ఎమ్మెల్యేలకు చెప్పామని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌ను అరెస్ట్ చేయటానికి రేవంత్ సర్కార్ ఎందుకు భయపడుతోందని ప్రశ్నించారు. అవినీతికి పాల్పడిన సంబంధిత మంత్రులను అరెస్ట్ చేయటానికి మీనమేషాలు లెక్కిస్తోందని విమర్శలు చేశారు. ఏడు నెలల్లో.. ఆర్ ట్యాక్స్, బీ ట్యాక్స్, యూ ట్యాక్స్ రాజ్యమేలుతోందని ధ్వజమెత్తారు. ఎన్నికల హామీ మేరకు వెంటనే కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ, రైతు భరోసా కోసం పోరాటం చేయాలని కార్యవర్గ సమావేశాల్లో తీర్మానించామని అన్నారు. నిరుద్యోగ యువతకు అండగా ఉండాలని నిర్ణయించామని చెప్పారు. నిరుద్యోగులపై ప్రతిపక్షంలో ఒకమాట.. అధికారంలో వచ్చాక మరోమాట కాంగ్రెస్ మాట్లాడుతోందని చెప్పుకొచ్చారు. ఓటమి భయంతోనే ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వేస్తోందని చెప్పారు. నెల రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతికి రూ.4,116 లేవు కానీ.. సీఎం రేవంత్ రూ. 4 లక్షలు నెల జీతం తీసుకుంటున్నాడని చెప్పారు. దేశంలో ఎక్కువ నెల జీతం రేవంత్ తీసుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా ఇవ్వలేదని ఎంపీ రఘునందనరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com